UESI
ANDHRA PRADESH

Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 29 - No.5

March 2023



## శ్రద్ధ లేకపోతే వృద్ధిలేదు

ఎడిటోరియల్

# మర్చిపోతే మనుగడకే ప్రమాదం

1959వ సం॥లో దీనబంధుగారు మద్రాస్ క్రిష్టియన్ కాలేజ్‌లో యంయస్సీ చేరారు. తోటి విద్యార్థి థియోడర్ శ్రీనివాసగంగారు దీనబంధు గారికి ఇయుని పరిచయం చేశారు. అప్పట్లో ఇయు విద్యార్థులు ఒకరిపట్ల మరొకరు ఎంతో ప్రేమను కనబరిచేవారు. దీనబంధుగారు కూడా ఎవరైనా ఇయు విద్యార్థి కనబడగానే అతని పట్ల ప్రేమ, శ్రద్ధ కనబరచాలనే ప్రేరణ ఆయనలో కలిగేది. వారితో సమయం గడపడం ఆయనకెంతో ఆనందాన్నిచ్చేది. యుఇయస్ఐ వ్యవస్థాపకుడైన ప్రొ. ఇనాక్‌గారి ఇంటికి తరచుగా వెళుతూ ఆయనతో సమయం గడిపేవారు. తన విశ్వాస జీవితంలో తనకెదురయ్యే శోధనల్ని ఆయనతో పంచుకొనేవారు. ఇనాక్‌గారు ప్రార్థనాపూర్వకంగా తగిన సలహాలు ఇచ్చి విశ్వాసంలో బలపరచేవారు. వారిచ్చే ఆతిథ్యం, ప్రేమపూర్వక పలకరింపు ఇవన్నీ దీనబంధుగారిని ఉక్కిరిబిక్కిరి చేసేవి.

తనతోటి ఇయు విద్యార్థి, స్నేహితుడైన జయపాల్ గారు దీనబంధుగారి ఆత్మీయ జీవితంపై ఎంతో శ్రద్ధను కనబరచేవారు. ఓ సాయంత్రం వీరిద్దరూ ఆత్మీయ సంగతులు మాట్లాడుకొంటూ మూడు మైళ్ళపైనే నడిచారు. అకస్మాత్తుగా దీనబంధుగారి కంట్లో నలక పడి తీవ్రమైన బాధ కల్గింది. కంటి వెంట నీరుకారిపోతూ ఉంది. వెంటనే జయపాల్‌గారు దీనబంధుగారి కనురెప్పలు తెరచి ఆ నలకను పోగొట్టడానికి గాలిని ఊదినప్పుడు ఆయన కళ్ళలో నీళ్ళని దీనబంధుగారు చూశారు. జయపాల్‌గారు దీనబంధుగారి బాధను తన బాధగా భావించారు. వారిద్దరూ దేవుని ప్రేమతో అంతగా బంధింపబడ్డారు. ఇలాంటి అనేక సంఘటనల ద్వారా ఇయులో గొప్ప సహవాసాన్ని వారనుభవించారు.

యుఇయస్ఐ ప్రారంభంలో పెద్దలు, నాయకులు క్రీస్తు కేంద్రీకృత, వాక్యకేంద్రీకృత జీవితాన్ని జీవిస్తూ, తోటి సభ్యులను క్రీస్తు ప్రేమతో ప్రేమించి, ఎంతో శ్రద్ధ చూపించేవారు. వీరికి ఒక ప్రత్యేకమైన జీవనశైలి ఉంది. ఆ జీవనశైలే మనం ఇప్పుడు నేర్చుకొంటున్న మౌలిక విలువలు. వాటిలో దేవుని వాక్యానికి అత్యంత ప్రాధాన్యతనివ్వడం, వ్యక్తిగత శ్రద్ధ, సహవాసం, దాతృత్వం, ఓపెన్‌హోమ్‌ను మరువలేము. వీరి సహవాసాన్ని, ప్రేమను, శ్రద్ధను అనుభవించిన వారు క్రీస్తులో స్థిరపడి, క్రీస్తుకు సాక్షులుగా ఉంటూ, సంఘాన్ని సమాజాన్ని ప్రభావితం చేశారు. పరిచర్య కూడా ఊహించని విధంగా వృద్ధిచెందింది.


యుఇయస్ఐ ప్రారంభమై 66సం॥లు అయ్యింది. పితరుల వలె జీవితం ద్వారా చూపించాల్సిన మౌలిక విలువల్ని ఇప్పుడు కేవలం బోధనాంశాలుగానే నేర్చుకొంటున్నాము గానీ వాటిని జీర్ణించుకోలేదు. అందుకే ప్రస్తుతం అనేక ఇయు, ఇజియఫ్‌లలో సహవాసంలోని జీవం, ప్రేమ, వ్యక్తిగత శ్రద్ధలు కరువయ్యాయి. ఫాలోఅప్ చేద్దాం, మెంటరింగ్ చేద్దాం, 1:3 కలిగి ఉందాం అని ప్రతి ఇయు, ఇజియఫ్ మీటింగ్స్‌లో నాయకులు ఎంత మొత్తుకొంటున్నా మన హృదయాలు మెత్తబడి స్పందించడంలేదు. అందుకేనేమో మన పరిచర్య అవ్వాల్సినంతగా వృద్ధి అవ్వడంలేదు. మౌలిక విలువలు మర్చిపోతే మనుగడకే ప్రమాదమని మనసు పెట్టి ఆలోచిద్దాం.

చాలామంది ఇయు విద్యార్థులు, యంగ్ గ్రాడ్యుయేట్స్ మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. పట్టించుకోవడం, శ్రద్ధచూపించడం అనేది ప్రేమలోనుంచి వచ్చే ప్రతిస్పందన. ప్రేమకు వ్యతిరేకపదం ద్వేషంకాదు, పట్టించుకోకపోవడమే. ఒక ఇయు విద్యార్థి, యంగ్ గ్రాడ్యుయేట్ ఇలా భావించడానికి కారణం ఆ సహవాసంలోగల ప్రేమరాహిత్యమే. సహవాసంలో పక్షపాత వైఖరి, గ్రూపిజమ్, కుల ఫీలింగ్స్, వ్యక్తులను వారికున్న తలాంతులను బట్టి విలువ కట్టడం మొదలైన నిమ్న భావాలు ఈ పరిస్థితికి ముఖ్యకారణాలు. మన ఇయు, ఇజియఫ్ సహవాసాల్లో ఇలాంటి భావనలు రాకుండా చూసుకోవాలి. కొన్నిసార్లు ఈ భావనకు విద్యార్థులు కూడా బాధ్యులే. బాధ్యత అంతా గ్రాడ్యుయేట్స్ మీద పెట్టకుండా తాము కూడా ఒక అడుగు ముందుకేసి వెళ్ళి పరిచయం చేసుకోవడం చాలా మంచిది.

విలియం ఆర్థర్ వార్డ్ అనే రచయిత ఇలా అంటాడు "నన్ను ఎవరైనా పొగిడితే నేను నమ్మకపోవచ్చు, నన్ను ఎవరైనా విమర్శిస్తే నేను ఇష్టపడకపోవచ్చు. నన్ను ఎవరైనా చిన్నచూపుచూసినా, పట్టించుకోకపోయినా నేను తట్టుకోలేను, క్షమించలేను, కానీ ఎవరైనా నన్ను ప్రేమించి, ప్రోత్సహించి, శ్రద్ధ చూపిస్తే నేను వారిని ఎన్నడూ మరచిపోను."

ప్రేమించడం, ప్రోత్సహించడం, శ్రద్ధచూపించడంలో యేసుక్రీస్తు గొప్ప మాదిరి చూపించారు. దాన్నే మన పితరులు అనుసరించారు. మనం కూడా ఇదే మాదిరిని కొనసాగించి పరిచర్యలో నాణ్యతను, వృద్ధిని చూద్దాం. వీటిని మర్చిపోతే మన మనుగడకే ప్రమాదం. ప్రమాదాన్ని చూస్తూచూస్తూ ఎవరూ కొనితెచ్చుకోరు. నిర్లక్ష్యంగా ఉండేవారు తప్ప.

– పి. సునీల్ జాకబ్



# విద్యార్థి జ్వాల

Vol. 29, No.5 March 2023
A Publication of
UESI Publication Trust

EDITORIAL BOARD:
Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.

CONTACT:
The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:
Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:
**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:
**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:
**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:
April: Expansion of the Ministry
May: Mission Partnership
June: Building Christlike leadership

**Note:** Please send your writeups on or before
**10th of every month**



## ఒకరినొకరు

ఒకరినొకరు ప్రేమించాలి - యోహాను 13:34
ఒకరినొకరు క్షమించాలి - ఎఫెసీ 4:32
ఒకరినొకరు ఆదరించాలి - 1థెస్స 4:18
ఒకరికొకరు క్షేమాభివృద్ధి కలుగజేసుకోవాలి - 1 థెస్స 5:11
ఒకరికొకరు పరిచర్య చేయాలి - 1 పేతురు 4:10
ఒకరినొకరు భరించాలి - కొలస్సీ 3:13
ఒకరినొకరు హెచ్చరించాలి - హెబ్రీ 10:25
ఒకరి భారములు ఒకరు భరించాలి - గలతీ 6:2
ఒకరినొకరు సేవించాలి - గలతీ 5:13
ఒకరికొకరు వందనాలు చెప్పాలి - రోమా 16:16
ఒకరితోఒకరు సమాధానం కలిగి ఉండాలి - మార్కు 9:50
ఒకరినొకరు చేర్చుకోవాలి - రోమా 15:7
ఒకరితోనొకరు కలిసి ఉండాలి - రోమా 12:15-16
ఒకరికొకరు సణగకుండా ఆతిధ్యం ఇవ్వాలి - 1 పేతురు 4:9
ఒకరికొకరు ఏకమనసు కలిగి ఉండాలి - అపొ.కా. 4:24,33

## లోపలి పేజీల్లో...


- **మర్చిపోతే మనుగడకే ప్రమాదం - 2**
- **శ్రద్ధ - 4**
- **సహవాసం ద్వారా సంపూర్ణత - 7**
- **విద్యార్థుల తల్లిదండ్రులతో సత్సంబంధాలు - 11**
- **ఒక్కళ్ళమే అయితే? - 14**
- **పరిచర్యలో ప్రమాదాలు - 15**
- **త్యాగపూరితంగా ఇద్దాం - 18**
- **ఎక్విప్ అవుదాం - 21**
- **విద్యార్థులే మన విజన్, మిషన్ - 24**
- **పట్టించుకొనేవాళ్ళున్నారు - 28**
- **కోశాధికారి లేఖ - 31**
- **అందుకే అంత మార్పు - 32**



కవర్ కథనం

# శ్రద్ధ

ప్రస్తుత సమాజంలో 'సెల్ఫీ కల్చర్' పట్ల విపరీతమైన మోజు, వ్యామోహం కనిపిస్తుంది. ఈ వ్యామోహంతో వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబ సంబంధాల్ని నాశనం చేసుకొంటున్నవారు, ప్రాణాలు పోగొట్టుకొంటున్నవారు టచాలామంది ఉన్నారు. “నేను, నా, నాకు, నాకే” వంటి భావనలతో, స్వార్థంతో జీవించడం వల్ల తోటి వారి పట్ల చూపించాల్సిన కనీస మానవ విలువలకు తిలోదకాలు ఇచ్చేస్తున్నారు. ఈ 'సెల్ఫీ కల్చర్' సమాజాన్నే కాదు, క్రైస్తవ సంఘాల్ని, సంస్థల్ని కూడా ఊహించని విధంగా ప్రభావితం చేస్తూ సహవాసాల్ని విచ్ఛిన్నం చేస్తుంది.

అపొస్తలుడైన పౌలు తిమోతికి రాసిన రెండవ పత్రిక మూడవ అధ్యాయంలో అంత్యదినాల్లోని విశ్వాసుల యొక్క 18 లక్షణాలను చెబుతాడు. వీటిలో మొదటి లక్షణం 'స్వార్థ ప్రియులు (లవర్స్ ఆఫ్ సెల్ఫ్). మరో మూడు లక్షణాలు కూడా ప్రేమతో ముడిపడి ఉంటాయి. ధనాపేక్షులు (లవర్స్ ఆఫ్ మనీ), సజ్జన ద్వేషులు (నాట్ లవర్స్ ఆఫ్ గుడ్), దేవునికంటే సుఖానుభవమును ఎక్కువగా ప్రేమించువారు (లవర్స్ఆఫ్ ప్లెజర్స్). సహవాసాల్లో ఇలాంటి లక్షణాలు గలవారు అన్నిటికంటే, అందరికంటే తన అవసరాలు, పనులు, కోరికలను ప్రథమ స్థానంలో ఉంచుకొంటారు. వీరు దేవునికి ప్రియులుగా, ఇష్టులుగా ఉండలేరు. దేవుని ఇష్టంకంటే సొంత ఇష్టమే వారికి ముఖ్యం. దేవుని దగ్గరికి వచ్చినా ఏదో ప్రయోజనాన్ని ఆశిస్తారు, తమ డబ్బును, సమయాన్ని, తలాంతులను ఎవ్వరితో పంచుకోరు. లెక్కలేసుకొనే తత్వం వారిలో ఉంటుంది. తోటివిశ్వాసుల ఆధ్యాత్మిక జీవిత ఎదుగుదల విషయంలో, పరిచర్యలో శ్రద్ధ, త్యాగపూరిత జీవితం ఉండక నిర్లక్ష్యంగా ఉంటారు.

స్వార్థానికి, ధనాశకు, సుఖానుభవానికి చచ్చినవారు, తమ్మునుతాము అన్ని విషయాల్లో ఉపేక్షించుకొన్నవారు ప్రభువు అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన కోసం ఉన్నతమైన జీవితాన్ని జీవిస్తూ, సంఘాలకు, సంస్థలకు ఆశీర్వాద కారకులుగా ఉంటారు. బైబిల్‌లోని, సంఘ చరిత్రలోని భక్తులు, యుఇయస్ఐలోని మన పితరుల సాక్షి సమూహం ఇలాంటి జీవితాన్ని జీవించి మనకు గొప్ప మాదిరిని ఉంచిపోయారు. ఎక్కడైతే స్వార్థం, ధనాశ, సుఖానుభవానికి ప్రాధాన్యత ఉంటుందో అక్కడ సహవాసంలోని మాధుర్యం అనుభవించడానికి, తోటివారి పట్ల శ్రద్ధ చూపించడానికి, త్యాగపూరితంగా పరిచర్య చేయడానికి అవకాశం ఉండదు.

క్రీస్తులో మనమంతా ఒక్క సహవాసానికి చెందినవారం. తోటివిశ్వాసులను సహోదరులు, సహోదరీలు అని పిలుస్తాము. అంటే, 'సహ ఉదరము' నుండి వచ్చినవారం, తోడబుట్టినవారం అని అర్థం. మనది భౌతిక, తాత్కాలికమైన రక్త సంబంధంకాదు, పరలోక, నిత్యత్వమైన 'క్రీస్తు రక్త

సంబంధులం'. దేవుని కుటుంబంలో మనమంతా జన్మించాం (గలతీ 6:10; ఎఫేసీ 2:19), ఒకే శరీరంలో అవయవములుగా ఉన్నాము (రోమా 12:5), మనం కలిసి జీవించాలి (ఎఫేసీ 4:16). అందువల్ల మన సహవాసాలు క్రీస్తుకు నచ్చేవిగా, మెచ్చేవిగా, ఆయనకు మహిమ తెచ్చేవిగా (మత్తయి 5:16) ఉండాలి. అందుకే దేవుని వాక్యంలో సహవాస ప్రాధాన్యతను తెలియజేస్తూ 'ఒకరికొకరు' అనేమాట 184 సార్లు కనిపిస్తుంది.

వలస వెళ్ళే పక్షులు సమూహంగా గాలిలో ఎగిరేటప్పుడు 'వి' ఆకారంలో ఎగురుతూ ప్రయాణం చేస్తాయి. ఒక పక్షి ఏదైనా ప్రమాదంలో చిక్కుకొన్నా, అనారోగ్యం పాలైనా దాని కోసం సమూహంలోని రెండు పక్షులు ప్రయాణాన్ని ఆపుకొని దానికి సహాయంగా ఉంటాయి. ఆ గాయపడ్డ పక్షి బాగుపడి తిరిగి ఎగిరే వరకు లేదా అది మరణించేవరకు తోడుగా ఉంటాయి. ఎంత గొప్ప పాఠం!

సహవాసంలో కూడా మనం ఒకరిని ఒకరు గౌరవిస్తూ, ప్రేమిస్తూ, శ్రద్ధ చూపించాలి. తమ అనుభవాలను, తలాంతులను, ధనాన్ని ఒకరితో ఒకరు పంచుకోవాలి. ఒకరినొకరు ప్రోత్సహించుకోవాలి, తోటివారిని నమ్మాలి, ఒకరిమీద ఒకరు ఆధారపడాలి, ఒకరి క్షేమాన్ని మరొకరు కోరుకోవాలి. ఒకరు బాధపడితే మరొకరు బాధపడాలి, ఒకరు సంతోషిస్తే మరొకరు సంతోషించాలి, ఒకరు పడితే మరొకరు లేవనెత్తాలి, ఆదరించాలి. ఒకరినొకరు భరించాలి, హెచ్చరించాలి, ఏకమనసు కలిగి ఉండాలి. సణగకుండా ఆతిథ్యమివ్వాలి, చేర్చుకోవాలి, పరిచర్య చేయాలి, సమాధానం కలిగి ఉండాలి.

దేవుడు మనలను ఒకరికోసం మరొకరు అవసరమయ్యే విధంగా సృష్టించాడు. మన సహవాసంలో స్వార్థానికి చోటివ్వకుండా క్రీస్తు ప్రేమతో వ్యక్తిగత శ్రద్ధను చూపించడం ద్వారానే విద్యార్థుల్ని, గ్రాడ్యుయేట్స్‌ను, స్టాఫ్‌ను యేసుక్రీస్తుకి శిష్యులుగా, సంఘాన్ని సమాజాన్ని ప్రభావితం చేసే మంచి నాయకులుగా ఇప్పటి వరకు తర్ఫీదు చేయగలిగాం. ఇక ముందూ ఇదే పనిని మునుపటికంటే ఎక్కువగా చేయాలి. ఒక విశ్వాసి ఆత్మీయ జీవితంలో, పరిచర్యలో నాణ్యత కలిగివుండాలన్నా, వ్యక్తిగా సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నా వ్యక్తిగత శ్రద్ధ ఎంతో అవసరం. కాబట్టి మనం యుఇయఫ్ఐ నేషనల్‌లో 2021-2024 సంవత్సరాలకు థ్రస్ట్ ఏరియాగా **'కేరింగ్ అండ్ గ్రోయింగ్'**ను ఏర్పాటు చేసుకొన్నాము.

## ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ వార్షిక నివేదిక 2021-2022 ప్రకారం

### 1. యంపిసిల పనితీరు

| క్రమ సంఖ్య | వివరాలు | బాలురు | బాలికలు |
|---|---|---|---|
| 1 | ఏర్పాటు చేసినవి | 990 | 742 |
| 2 | జరిగినవి | 390 | 358 |
| 3 | జరిగిన శాతం % | 39% | 48% |

### 2. డిసైప్లింగ్ జరిగిన విధానం

| క్రమసంఖ్య | వివరాలు | సంఖ్య |
|---|---|---|
| 1 | సువార్తకు స్పందించిన వారు | 10470 |
| 2 | ఫాలోఅప్ చేయబడిన వారు | 3976 |
| 3 | డిటి క్యాంప్‌కు హాజరైన వారు | 1540 |

పై వివరాలను గమనిస్తే మన నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడడం లేదా?

## శ్రద్ధ చూపించడంలో మన లోపాలు

- ❖ తోటి విశ్వాసుల పట్ల శ్రద్ధను చూపించాల్సిందిపోయి, ఇతరుల నుంచి శ్రద్ధను కోరుకొనే/పొందుకొనే వారిగానే మిగిలిపోయాం.
- ❖ తోటి సభ్యులతో ప్రేమగా మాట్లడకపోవడం.
- ❖ ప్రోగ్రామ్స్ మీద పెట్టినంత శ్రద్ధ, వ్యక్తుల మీద పెట్టకపోవడం.
- ❖ నీ కంటే నేనే ఎక్కువ అనే మనస్తత్వంతో ఉండడం.
- ❖ పొరుగువారిని ప్రేమించాలి అన్న ఆజ్ఞ పట్ల ఆసక్తి లేకుండానే జీవించడం.
- ❖ వ్యక్తిగత శ్రద్ధ లోపించడం మూలంగా విద్యార్థుల రక్షణ నిజమైనదో కాదో తెలుసుకోలేక పోవడం.
- ❖ విద్యార్థులు దేవునిపై ఆధారపడే వారిగా ఉండడం లేదు.
- ❖ నిజమైన, సరైన శిష్యులను, తయారు చేయలేక పోతున్నాము.
- ❖ ప్రభావవంతమైన నాయకులను అందించలేక పోతున్నాము.

❖ పరిచర్యలో నాణ్యతను చూడలేకపోతున్నాము.

❖ రిసోర్స్ పర్సన్స్, కౌన్సిలర్స్ కొరత ఏర్పడేలా చేశాము.

❖ సహవాసంలోని మాధుర్యాన్ని అనుభవిస్తూ, తిరిగి ఇవ్వాలనే స్పృహ లేకపోవడం.

❖ సంబంధాల్ని కట్టే విషయాలైన– ఆత్మీయతకు ప్రాధాన్యతనివ్వడం, మనల్ని మనం ఉపేక్షించుకోవడం, ఇతరుల గురించి ఆలోచించడం, తగ్గింపు, సేవక హృదయం, సహనం మొదలైన వాటికి తక్కువ ప్రాధాన్యతనిస్తూ, సంబంధాల్ని పాడు చేసే విషయాలైన – గర్వం, స్వార్థం, పోటీతత్వం, సమస్యలను పరిష్కరించుకోకపోవడం, అనాలోచిత, నిర్లక్ష్యంతో కూడిన మాటలు, తెలిసిన విషయాలను గుప్తంగా ఉంచకపోవడం...మొదలైన విషయాలకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వడం.

పై విషయాలను ఆలోచిస్తే తోటి సభ్యుల పట్ల శ్రద్ధ చూపించలేకపోవడం వల్ల క్వాంటిటీ, క్వాలిటీ రెండూ క్రమంగా తగ్గుతూ ఉన్నాయి. గనుక యల్ఆర్పి-2030లో తోటి సభ్యుల పట్ల శ్రద్ధను పెంచడం అనే ప్రాముఖ్య అంశాన్ని రెండవ ఫోకస్ ఏరియాగా పెట్టడం జరిగింది. కాబట్టి ఈ సంవత్సరం (2022-23) నుండి మనమందరం వ్యక్తిగతంగా, కమిటీగా, సహవాసంగా అన్ని స్థాయిలలో తోటి సభ్యుల పట్ల శ్రద్ధను పెంచడం మీద దృష్టి పెడదాం.

## తోటి సభ్యుల పట్ల శ్రద్ధను పెంచడం వలన కలిగే లాభాలు

❖ ప్రభువు ఆజ్ఞకు విధేయత చూపుతాం.

❖ మన సహవాసంలోని మాధుర్యాన్ని అందరం ఆస్వాదిస్తాం.

❖ మన వ్యక్తిగత జీవితంలో, పరిచర్యలో అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

❖ అన్ని స్థాయిల్లో మెంటరింగ్ జరుగుతుంది.

❖ డ్రాపౌట్స్ తగ్గించవచ్చు.

❖ భవిష్యత్తు కొరకు నాణ్యత కలిగిన నాయకులు, కుటుంబాలు తయారవుతాయి.

❖ కుటుంబాలు సర్వతోముఖాభివృద్ధి చెందుతాయి.

❖ సభ్యులందరికీ కావలసిన ప్రోత్సాహం దొరుకుతుంది.

❖ సభ్యులందరి యొక్క ఆధ్యాత్మిక, మానసిక ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.

❖ సభ్యుల్లో దాతృత్వం పెరుగుతుంది.

❖ నాణ్యమైన విశ్వాస విద్యార్థులు తయారవుతారు.

❖ సహవాసంలో సంతోషం, నమ్మకం పెరుగుతాయి.

❖ సభ్యుల మధ్య ప్రేమతో కూడిన సంబంధ బాంధవ్యాలు మెరుగుపడతాయి.

❖ కుటుంబాలు ఓపెన్ హోమ్స్‌గా పరిణతి సాధిస్తాయి.

❖ సభ్యులు యుఇయస్ఐ దర్శనాన్ని పుణికి పుచ్చుకొంటారు.

❖ యుఇయస్ఐ సిద్ధాంతాలను అంగీకరించే సభ్యత్వ నమోదు జరుగుతుంది.

❖ స్టాఫ్‌కు కావలసిన శ్రద్ధ, మెంటరింగ్ లభిస్తుంది.

## ముగింపు

సహవాసంలో ఉన్న వ్యక్తుల పట్ల శ్రద్ధ చూపించడంలో మనకు మాదిరి మన రక్షణ కర్త అయిన ప్రభువే. ఆయన వ్యక్తుల పట్ల శ్రద్ధను చూపిస్తూ వారి జీవితాలను కట్టాడు. నిర్లక్ష్యం వహించలేదు, కూలద్రోయలేదు. గనుక విద్యార్థులను, గ్రాడ్యుయేట్స్‌ను దర్శిద్దాం, ప్రేమిద్దాం, అభినందిద్దాం, వారి కష్టాలను, కడగళ్ళను, నొప్పిని, ఆవేదనను విందాం. మన భుజంపైన ఆనుకొని సేదదీరనిద్దాం. వారి సుఖదు:ఖాలను ఒకరితోనొకరం పంచుకొందాం.

"తోటి మానవాళి లేక జీవుల పట్ల చేసే అమానుష లేక క్రూరమైన పాపం, వారిని ద్వేషించడం కాదు గానీ, వారిపట్ల ఉదాసీనత లేక అశ్రద్ధ వైఖరి కనపరచడం అని అంటాడు" జార్జి బెర్నార్డ్ షా. విశ్వాసులంగా ఉదాసీనత, నిర్లక్ష్య, అశ్రద్ధ వైఖరిని విడనాడుదాం, విశ్వాసుల క్షేమం కోసం ప్రార్థిద్దాం, ఒకరినొకరం అన్ని విషయాల్లో క్రీస్తులా ఎదిగేలా ప్రయాసపడదాం.

– జె. పాల్ శామ్యూల్,
నేషనల్ ప్లానింగ్ అండ్ ఇవాల్యుయేషన్ సభ్యులు, నంద్యాల



# సహవాసము ద్వారా సంపూర్ణత

ఈ ప్రపంచాన్ని వేధిస్తున్న గొప్ప సమస్యల్లో ఒకటి ఒంటరితనం. అర్థవంతమైన సంబంధాల కోసం ప్రజలు ఆరాటపడుతున్నారు. ప్రేమించడానికి, ప్రేమించబడడానికి, మాట్లాడడానికి, తమతో మాట్లాడే వ్యక్తుల కోసం ప్రజలు ఎదురు చూస్తూ ఉన్నారు. మానవునికి అర్థవంతమైన సహవాసం కోసం లోతైన ఆకలి ఉన్నా ప్రపంచంలో దానిని పొందుకోలేకపోతున్నాడు. ఆధునిక కాలములో సహవాసం హైజాక్ చేయబడిందని కార్ల్ ట్రుమన్ అనే భక్తుడు చెబుతాడు. ఈ ప్రపంచం అందించలేని అర్థవంతమైన సంబంధాల్ని, సహవాసాన్ని, ప్రేమను క్రైస్తవ్యం మాత్రమే అందిస్తుంది. ఆది క్రైస్తవుల యొక్క సహవాస ప్రేమను చూసి అప్పటి సమాజం వారిని క్రైస్తవులని గుర్తించింది.

ఇంత గొప్ప ఆశీర్వాదం కలిగిన క్రైస్తవులు కూడా సహవాసాన్ని సరిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. మన ఆధునిక క్రైస్తవ సంఘంలో ఉన్న గొప్ప కొరత సహవాసం లేకపోవడమే. దేవుని ప్రజలకు సహవాసం యొక్క నిజమైన అర్థాన్ని తిరిగి పునరిద్ధరించడం అత్యవసరం. రక్తము సరిగా ప్రసరించని శరీరం అసహజ స్థితిలో ఉన్నట్లు సహవాసం లేని సంఘం కూడా స్తబ్ధ స్థితిలో ఉంటుంది. సహవాసం ద్వారానే సంఘం, విశ్వాసులు బలము పొందుతారు, లేకపోతే బలాన్ని కోల్పోతారు.

## సహవాసం - క్రైస్తవ భావన

సహవాసం అనే తెలుగు పదము గ్రీకులోని 'కొయనోనియా' నుంచి వచ్చింది. దీనర్థం పంచుకోవడం లేదా ఏదైనా మనందరిదని అందరూ అనుకొని కలిసి స్వేచ్ఛగా, మనదిగా కలిగి ఉండడము, పంచుకోవడము. సహవాసం అనే పదం నూతన నిబంధనలో అనేక రూపాలలో దాదాపు 30 సార్లు కనబడి, 'పాల్గొనడం, పంచుకోవడం, సహవాసము' అని వివిధ రకాలుగా ఉపయోగించబడింది. క్రైస్తవ్యంలో సహవాసం అంటే సామాజిక ప్రక్రియ కన్నా ప్రాముఖ్యమైనది. కాఫీ తాగడం, కలిసి పిచ్చాపాటి మాటలు మాట్లాడుకోవడం, యాత్రలు చేయడం సహవాసం కాదు.

## క్రైస్తవ సహవాసం రెండు దిశలు

ఒకటి నిటారుగా, రెండవది సమాంతరంగా. పైకి నిటారుగా ఉండే సహవాసము అంటే దేవునితో సహవాసం, సమాంతరంగా అంటే మనము తోటి క్రైస్తవులతో కలిగి ఉండే సహవాసం.

### 1. దేవునితో సహవాసం

మనము రక్షణపొంది యేసుక్రీస్తులో ఐక్యపరచబడి దేవునితో సహవాసంలోనికి వచ్చాము. ఇదొక వాస్తవం. రక్షింపబడిన ప్రతి వ్యక్తి కూడా దేవునితో సహవాసంలో ఉన్నాడు. 1 యోహాను పత్రికలో 'మన సహవాసమైతే తండ్రితో కూడను ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతో కూడను ఉన్నది' అని చెప్పబడినది. తన యొక్క కుమారుని సహవాసానికి దేవుడు మనలను పిలిచాడు (1 కొరింథీ 1:9). మనము క్రీస్తులో ఉన్నామనే మాట కొత్త నిబంధనలో చాలా సార్లు కనబడుతుంది. దేవునితో సహవాసాన్ని కలిగి ఉండాలనే యేసుక్రీస్తు సిలువలో మన కొరకు చనిపోయాడు.

యేసుక్రీస్తు, పరిశుద్ధాత్మ దేవుని పని ద్వారా దేవుడు తనను తాను మన కొరకు ఇచ్చుకొన్నాడు. పరిశుద్ధాత్మ దేవుడు యేసుక్రీస్తు సిలువలో చేసిన పని, వ్యక్తిత్వాన్ని ఆధారం చేసుకొని ఆయన యొక్క సౌందర్యాన్ని, మహిమను, ఆయన అధికృతలను

మేము ఇతరుల కంటే పరిశుద్ధులం, గొప్పవారం, భక్తిపరులమనే భావన కలిగియుండేవారు ఇతరులతో సహవాసము చేయడానికి ఇష్టపడరు. ఎక్కడైతే గర్వము ఉంటుందో అక్కడ సహవాసం మరణిస్తుంది. యేసుక్రీస్తు శరీరంలో ఎవ్వరూ అధికులు కాదు గొప్పవారు కాదు అందరూ సమానులే. నేను నాకన్నా తక్కువ వారితో సహవాసం చేయను అనే భావన ఎంతో ప్రమాదకరమైనది. ఉద్యోగం ఉన్నవారితో, చదువులలో బాగా రాణించేవారితో, మంచిగా వాక్యము చెప్పేవారితో, కేవలం కమిటీ సభ్యులతో, పరిచర్య బాగా చేసేవారితో, ఆర్థికంగా స్థిరపడిన వారితో, నా కులపు క్రైస్తవులతోనే సహవాసం చేస్తాను అనే భావనలు ఎక్కడ ఉంటాయో అప్పుడు అది సాతాను కల్పించిన నకిలీ సహవాసంగా మనము గుర్తించాలి.

మనకు చూపించి ఆయనను మనకు గొప్ప స్వాస్థ్యము లాగా చేస్తాడు. దేవుని గూర్చిన సమాచారాన్ని బైబిల్ మన మనసులకు అందిస్తుంది . పరిశుద్ధాత్మ దేవుడు ఆ జ్ఞానము యొక్క ఆధ్యాత్మిక విలువను గూర్చి మన మనసులను వెలిగిస్తాడు. తద్వారా దేవునికి సమీపముగా ఉండే మాధుర్యాన్ని వాక్యము ద్వారా అనుభవించగలుగుతాము.

క్రైస్తవ సహవాసానికి గొప్ప మాదిరి త్రియేక దేవుని సహవాసమే. అటువంటి అనుభవం త్రిత్వంలో నిక్షిప్తమైయున్నదని చూపించకుండా ఆ అనుభవము గురించి మాట్లాడలేము. మనము దేవుని యొక్క సంపూర్ణతను అనుభవించాలంటే త్రిత్వాన్ని అర్థంచేసుకొని, త్రిత్వంలోని ప్రతి వ్యక్తితో ఎలా సహవాసం చేయవచ్చో అన్వేషించాలి. దేవునితో సహవాసం అనగా త్రియేక దేవునితో సహవాసం. వాక్యాన్ని ధ్యానించడము ద్వారా, ప్రార్థనలో ఆయనతో వ్యక్తిగతంగా గడపడం ద్వారా మనం దేవునితో సన్నిహిత సహవాసాన్ని అనుభవిస్తూ సంతోషించవచ్చు. దేవునితో సహవాసం త్రియేక దేవునితో కాకపోతే అది సహవాసమే కాదు.

“దేవునితో సమయాన్ని గడపడం ఒక గొప్ప నిధి అని, దేవునితో మనం ఎక్కువ సమయం గడపడం వల్ల మన ప్రవర్తన మారి, భక్తిజీవితం, యధార్థత పెంపొందుతుంది. తద్వారా దేవునిని విశ్వసించని ఈ లోకం దేవున్ని తెలుసుకొంటుంది” అని ఛార్లెస్ స్టాన్లీ అంటాడు.

### 2. క్రైస్తవులతో సహవాసం

దేవునితో సహవాసం క్రైస్తవ సహవాసం యొక్క ఒక కోణం అయితే తోటి క్రైస్తవులతో సహవాసం ఇంకో కోణం. అది దేవునితో ఉన్న సహవాసం నుంచి ఉద్భవిస్తుంది. నూతన నిబంధనలో సహవాసం అనే పదము మొదటిగా అపోకా 2:42 వ వచనంలో కనబడుతుంది. అక్కడ రక్షణ పొందిన ఆది క్రైస్తవులు తమ్మును తాము సహవాసానికి అప్పగించుకొన్నారని రాయబడినది. 1 యోహాను 1:3లో మనమందరం ఒకే జీవాన్ని పంచుకొన్నామని రాయబడింది. కాబట్టి రక్షణ పొందినవారందరూ సహవాసములోనికి వస్తారు. మనలో నివసించే పరిశుద్ధాత్ముని ద్వారా మనందరం దేవుని యొక్క జీవాన్ని పంచుకొంటున్నాము. యేసుక్రీస్తుతో మనము ఐక్యపరచబడ్డాం కాబట్టి మనము ఆధ్యాత్మికంగా జీవించే ఓ సముదాయం అయ్యాము. హోవార్డ్ హెండ్రిక్స్ ప్రకారము కోయినోనియా అంటే సామూహిక సంబంధము. ఇదొక పని కాదు ప్రాథమికంగా అయితే ఇదొక సంబంధం. మనము యేసుక్రీస్తుతో, ఒకరితో ఒకరం సమూహంగా సంబంధం కలిగి ఉండడానికి పిలవబడ్డాము.

కోయినోనియా రెండవ అర్థం భాగస్వామ్యం. మనము ఒకరితో ఒకరం భాగస్వామ్యంలో ఉన్నాము. మనము మన జీవితాలను, ఒకరితో ఒకరం సహవాసం ద్వారా జీవించాలి. మన యొక్క జీవితమే సహవాసములో వ్యక్తీకరించబడుతుంది. ఫెలోషిప్ ఆప్షనల్ కాదు, గానీ సంపూర్ణ ఆరోగ్యకరమైన క్రైస్తవ జీవితానికి చాలా ఆవశ్యకమైనది. క్రైస్తవ సహవాసం అనేది దేవుని పిల్లల మధ్య ఉండే కుటుంబ వ్యవహారము. దీనిలో ఇవ్వడం, తీసుకోవడం అనేది రెండువైపుల నుంచి జరుగుతుంది. ఇందులో మొదటిగా దేవుడు తన గురించి మనకు తెలియజేసిన దానిని ఇతర క్రైస్తవులతో పంచుకోవడం జరుగుతుంది. తద్వారా వారు కూడా దేవుని గూర్చిన జ్ఞానములో ఎదిగి దేవునితో తమ యొక్క సహవాసాన్ని పటిష్టపరచుకోవడానికి దోహదపడతాము.

యోహాను కూడా తాను పత్రిక రాయడం వెనుక

ఉన్న ఉద్దేశము గురించి చెబుతూ 'మీకు మాతో కూడా ఈ సహవాసం కలిగియుండునట్లు' అని రాస్తున్నాడు. వారు కూడా తాను తెలుసుకొన్న దేవునితో సహవాసంలోనికి రావాలని ఆశతో రాస్తున్నాడు. అపోస్తలుడైన పౌలు రోమా పత్రిక 1వ అధ్యాయంలో ఈ రెండవ కోణము గురించి రాస్తాడు . "మీరు స్థిరపడవలెననియు అనగా మీకును నాకును కలిగియున్న విశ్వాసము చేత అనగా మనము ఒకరి విశ్వాసము వలన ఒకరము ఆదరణ పొందవలెననియు" అంటాడు. పౌలు కోరుకొంటున్న సహవాసము రెండువైపులా ఉండేది. పౌలు కూడా ఇతరుల యొక్క సహవాసము తనకు అవసరమని గుర్తించి, దానిని ఆశిస్తున్నాడు. దీనికి భిన్నంగా కొంతమంది క్రైస్తవులు ఇతరుల యొక్క పరిచర్య ద్వారా సహాయం పొందడానికి ఇష్టపడడంలేదు.

క్రైస్తవ సహవాసము ప్రేమ, దీనత్వము యొక్క వ్యక్తీకరణగా మనము చూడవచ్చు. ఇది ఇతరులకు మేలు చేయాలి. దీంట్లో రెండు లక్ష్యాలు ఉంటాయి, మంచి చేయడము, మంచిని పొందడము.

## సహవాసం యొక్క ప్రాముఖ్యత

### 1. సహవాసం కృపను పొందే సాధనం (2 థెస్స3:1-5)

సహవాసం ద్వారా ఒకని ఆత్మ సేదదీరుతుంది, పోషించబడుతుంది. ఒకడు దేవుని గూర్చిన సంగతుల ను ఇతరులకు చెప్పే ప్రయత్నంలో వాటిని గూర్చిన అవగాహన అతనికింకా పెరుగుతుంది. నీకోసము ప్రార్థించే సహోదరులను కలిగియుండడం, తోటి క్రైస్తవుడిగా నీ పట్ల శ్రద్ధ చూపించడం, వారి యొక్క శ్రమలు, విజయాలు నీతో పంచుకోవడం ద్వారా నువ్వెంతగానో సారంగలవాడవు అవుతావు. ఇతరులకు నువ్వు సహాయం చేయడం ద్వారా నువ్వు ఆధ్యాత్మికంగా ఎదుగుతూ, వారికి మేలుచేసినవాడవు కూడా అవుతావు. పౌలు తన కోసము ప్రార్థన చేయమని క్రైస్తవులను వేడుకొంటాడు. క్రైస్తవ సహవాసము కృపను పొందే సాధనం కాబట్టి దానిని నిర్లక్ష్యము చేయడమంటే మనము దారిద్ర్యాన్ని, ప్రమాదాన్ని కోరుకొన్నట్లే.

### 2. సహవాసం జీవితపు పరీక్ష (ఎఫెసీ 4:15,25)

సహవాసం అంటే ఒకని హృదయాన్ని తన తోటి క్రైస్తవుని ముందు తెరవడం. ఎక్కడైతే కపటం, దాయడం ఉంటుందో అక్కడ నిజమైన సహవాసం ఉండదు. తన గురించి ఇతరులతో మాట్లాడేటప్పుడు ఎవరైతే కపటానికి, దాచిపెట్టడానికి దూరంగా ఉంటాడో అతను దేవునితో యధార్థంగా ఉంటాడు. ఎవరు దేవుని వాక్యపు వెలుగు తన జీవితం మీద పూర్తి గా పడడానికి ఒప్పుకోడో అతను ఇతర క్రైస్తవులతో సహజమైన సహవాసాన్ని కలిగియుండలేడు. అతని కపటం బయటపడినప్పుడు సహవాసం నుంచి దూరమవుతాడు (1 యోహాను 1:7)

### 3. సహవాసం దేవుని వరము

న్యూ ఇంగ్లీష్ బైబిల్ అనువాదంలో 2 కొరింథీ 13:14 ఇలా ఉంటుంది. యేసుక్రీస్తు యొక్క కృపయు, దేవుని ప్రేమయు పరిశుద్ధాత్మలో సహవాసమును మీకందరికి తోడైయుండును గాక. ఇది కేవలము పరిశుద్ధాత్మ దేవుడు వ్యక్తుల హృదయంలోకి వచ్చినప్పుడు మాత్రమే మనుష్యులు ఆధ్యాత్మికంగా బ్రతికింపబడి, తాము కృపలో ఎదగాలనే ఆసక్తిని కలిగియుండి, ఇతరులు కూడా ఎదగడానికి సహాయము చేస్తారు. అప్పుడే ఈ సహవాసం సాధ్యమవుతుంది. కాబట్టి సహవాసం దేవుని వరం. మనము ఒకరికొకరం సహవాసంలో సంతోషించాలంటే ప్రార్థనాపూర్వకముగా దేవుని ప్రేమన మన హృదయంలో కుమ్మరించే పరిశుద్ధాత్మ దేవుని మీద ఆధారపడుతూ ఉండాలి.

## క్రైస్తవ సహవాసాన్ని ఆటంకపరచేవి

### 1. స్వయం సమృద్ధి (1 పేతురు 4:10, ఎఫెసీ 4:13)

ఆధ్యాత్మిక సహాయం కొరకు ఒకరిమీద ఒకరం ఆధారపడాలని గ్రహించనంత వరకు నిజమైన సహవాసం సాధ్యము కాదు. ఆధ్యాత్మికంగా స్వయం సమృద్ధి కలిగియున్నామనే భావన రక్షణపొందని స్థితిని చూపిస్తుంది. క్రైస్తవ్యం వ్యక్తిగతమైన, రహస్యమైన అనుభవం కాదు. మనము ఒకరి కొకరు అవసరం. ఎందుకంటే దేవుడు తనతో, తోటి క్రైస్తవులతో మన సహవాసం ద్వారా పోషించబడే విధంగా మనలను చేశాడు. రక్షణపొందిన ప్రతి వ్యక్తి సహవాసాన్ని కోరుకొంటాడు. సహవాసం లేకుండా సంపూర్ణులం కాలేము. సహవాసం లేకుండా క్రీస్తు సారూప్యంలోనికి మార్చబడలేము. ఇతర క్రైస్తవుల ద్వారా దేవుడు మనకు ఇవ్వాలనుకొన్న ఆశీర్వాదాలను, కృపలను పొందలేము.

### 2. ఆచారం (1 కొరింథీ 12:25, గలతీ 6:2)

కొంతమందికి సహవాసమంటే ఆచారంగా సామూహిక ఆరాధనలో పాల్గొనడం, ప్రభువు బల్లలో పాల్గొనడం, క్యాంప్స్, మీటింగ్స్, సమావేశాలకు హాజరవ్వడం అని అనుకొంటుంటారు. కేవలం హాజరవ్వడం, పిచ్చాపాటి మాటలు మాట్లాడుకోవడం సహవాసం కాదు. సహవాసం అంటే అంతకు మించినది. సహవాసంలో జీవవాక్యాన్ని పంచుకోవాలి, హెచ్చరించుకోవాలి, ప్రోత్సహించుకోవాలి, బలపరచుకోవాలి, ఆదరించుకోవాలి, సువార్త అనుభవాలను పంచుకోవాలి, ఒకరినొకరు అర్థం చేసుకోవాలి, సమూహముగా కలసి ప్రార్థన చేసుకోవాలి, సహాయం చేసుకోవాలి. వారి యొక్క విశ్వాసాన్ని బలపరచాలి, సలహాలు ఇచ్చుకోవాలి, అది సజీవమైనదిగా ఉండాలి.

### 3. ద్వేషము లేదా క్షమించుకోలేకపోవడం (ఎఫెసీ 4:32)

గాయపడిన అహము, మనస్పర్థలు, తక్కువగా చూడబడడం, ఇతరులకు ఇవ్వబడిన కృపావరాలను బట్టి అసూయ, పుకార్లు పుట్టించడం, ఇతరులను క్షమించలేకపోవడం ఇవన్నీ సహవాసానికి ఆటంకాలుగా ఉంటాయి. అనంతమైన పరిశుద్ధత కలిగిన దేవుడే ఘోరమైన పాపులను క్షమించి, వారిని అంగీకరించి వారితో సహవాసం చేయడానికి ఇష్టపడ్డాడు. అలాంటిది నీవు సహోదరుని క్షమించక, వారితో సహవాసం చేయడానికి ఇష్టం చూపించడం లేదంటే నువ్వు దేవుని కన్నా గొప్ప పరిశుద్ధత కలిగినవాడవు అయ్యుండాలి లేదా నీ ఆత్మీయ జీవితంలో లోపమైనా ఉండాలి. ఇతరులను దేవునిలో ఉన్నతులుగా చేయాలనేదే సహవాసం యొక్క ఉద్దేశం అయినప్పుడు వారు ఎదుగుతుంటే అసూయ పడకూడదు. ఆటంకాలు సృష్టించకూడదు.

### 4. అధికులమనే భావన (రోమా 12:10; 1పేతురు 5:5)

మేము ఇతరుల కంటే పరిశుద్ధులం, గొప్పవారం, భక్తిపరులమనే భావన కలిగియుండేవారు ఇతరులతో సహవాసము చేయడానికి ఇష్టపడరు. ఎక్కడైతే గర్వము ఉంటుందో అక్కడ సహవాసం మరణిస్తుంది. యేసుక్రీస్తు శరీరంలో ఎవ్వరూ అధికులు కాదు గొప్పవారు కాదు అందరూ సమానులే. నేను నాకన్నా తక్కువ వారితో సహవాసం చేయను అనే భావన ఎంతో ప్రమాదకరమైనది. ఉద్యోగం ఉన్నవారితో, చదువులలో బాగా రాణించేవారితో, మంచిగా వాక్యము చెప్పేవారితో, కేవలం కమిటీ సభ్యులతో, బాగా పరిచర్య చేసేవారితో, ఆర్థికంగా స్థిరపడిన వారితో, నా కులపు క్రైస్తవులతోనే సహవాసం చేస్తాను అనే భావన ఎక్కడ ఉంటుందో అది సాతాను కల్పించిన నకిలీ సహవాసంగా మనము గుర్తించాలి. మనం బలహీన క్రైస్తవులతో, పాపంతో పోరాడుతున్నవారితో, పేదవారితో, ఉద్యోగము లేనివారితో ఇలా తారతమ్యాలు చూపించకుండా అందరితో సహవాసం చేయాలి.

### ముగింపు

ఈ రోజుల్లో కూడా క్రైస్తవులకు సహవాసం అవసరము. ఎవ్వరూ ఆధ్యాత్మికంగా స్వయం సమృద్ధి కలిగినవారు కాదు. సహవాసము లేకపోతే మనము బలహీనమైన క్రైస్తవులమయ్యే ప్రమాదంలో ఉన్నవారమే.

క్రైస్తవులు ఈ రోజుల్లో సహవాసపు కొరతను కలిగియున్నారు. సహవాసపు సమావేశాలు జరుగు తున్నాయి గానీ సహవాసము యొక్క వాస్తవికత కోల్పోయి, చాలా కృత్రిమంగా మారినట్లు చూస్తు న్నాము. దీనికి కారణం మనము ఈ లోకం యొక్క విధానంలో సహవాసాన్ని చూడడమే. మనము నిజమైన సహవాసాన్ని అనుభవించకుండానే సహవాసాన్ని కలిగియున్నామనే భ్రమలో చాలాసార్లు ఉంటున్నాము. మన సహవాస కూడికలు క్రీస్తు కేంద్రితంగా, ఇతరుల క్షేమాభివృద్ధి కేంద్రితంగా, దేవున్ని మహిమపరచేవిగా ఉండాలే గాని స్వమహిమ, వ్యక్తి కేంద్రీకృతంగా కాదు. గనుక ఈ విషయంలో చాలా యధార్థంగా మనల్ని మనం పరీక్షించుకోవాలి.

క్రైస్తవులు తప్పని సరిగా సహవాసాన్ని కోరుకోవాలి. ఒంటరిగా ఉండే క్రైస్తవులు ఆకలితో చచ్చిపోయే నిరుత్సాహ క్రైస్తవులు. ప్యూరిటన్స్ "నాకు ప్రియమైన స్నేహితునిని ఇవ్వు అని దేవునికి ప్రార్థన చేసేవారు. వేదాంతం, చరిత్రలో కూడా సహవాసము, ఉజ్జీవము అనేవి కలసి ఉన్నాయి. వాస్తవానికి పునరుద్ధరింపబడిన క్రైస్తవ సహవాసము అనేది ఉజ్జీవము యొక్క ఒక అంశము. మన యుఇయస్ఐ పరిచర్యలో సహవాసాన్ని దాని సరైన స్థలంలో పునరుద్ధరించడానికి మనం కృషి చేద్దాం.

**– డా. నాసరయ్య,** వైజాగ్



# విద్యార్థుల తల్లిదండ్రులతో సత్సంబంధాలు

సెల్‌ఫోన్ రింగ్ అవుతుంది. ఏదో పనిలో ఉండి ఆన్సర్ చేయలేకపోయింది మేరి. పది నిమిషాల్లో మళ్ళీ రింగ్ అయ్యింది. తెలియని నెంబర్ నుంచి కాల్ వచ్చింది. ఎవరై ఉంటారా? అని అనుకుంటూనే ఆన్సర్ చేసింది.

"హలో!'

"అక్కా! నేను లక్ష్మీని"

"ఎవరమ్మా నువ్వు? ఎక్కడ కలిశాను?"

"అక్కా, నేను మిమ్మల్ని కాన్ఫరెన్స్‌లో మీ టాక్ అయిన తర్వాత కలిశాను".

"అవునమ్మా జ్ఞాపకమొచ్చింది. నాన్నగారు ఎలా ఉన్నారు?"

"బాగుండడం లేదక్కా".

"అక్కా మీతో ఒక విషయం షేర్ చేద్దామని చేశాను. నా మ్యారేజ్ ప్రపోజల్ గురించి మాట్లాడదామని. మా తల్లిదండ్రులు దేవున్ని నమ్ముకోని అబ్బాయిల్ని తీసుకొస్తున్నారు. కాదని అంటే.. అన్నీ నువ్వు తోసిపుచ్చితే ఎలా? ఏదో ఒకటి చేస్తామని గట్టిగా ఒత్తిడి చేస్తున్నారు".

"మా ప్రేయర్ అక్కవాళ్ళు చూస్తారంటే..."

"అసలు మీ ప్రేయర్ వాళ్ళు ఎవరు? వాళ్ళతో మనకేంటి? మన సంగతులు వాళ్ళకి ఎలా తెలుస్తాయి?" అని గట్టిగా మాట్లాడుతున్నారు.

"లక్ష్మీ! మన గ్రాడ్యుయేట్స్ ఇంతకుముందెప్పుడూ మీ ఊరు రాలేదా? మీ పేరెంట్స్‌తో మాట్లాడలేదా?"

"లేదక్కా! అందరూ బిజీగా ఉంటారు, వాళ్ళకి వీలు పడడం లేదు. ఏమి చేయాలి?"

***

"మా అమ్మాయికి సంబంధం వచ్చింది. ఇది దేవుని చిత్తము, దేవుడు నాతో మాట్లాడుతున్నాడని" చెబుతుంది.

"ఇది ప్రేమ పెళ్ళా అని బంధువులందరూ అడుగుతున్న ప్రశ్న?".

"పెళ్ళిలో కూడా అమ్మలక్కలు లవ్‌మ్యారేజ్ అనుకుంటూ" అని ఊసులు.

***

"హలో రాము చాలా కాలానికి వచ్చావు. జాబ్ సంగతేంటి? మొన్న వచ్చిన ప్రపోజల్ విషయం ఏమిటి? అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాను. లంచ్ తరువాత కాసేపు పరిచర్య విషయాలు మాట్లాడుకున్నాము.

బిజీగా ఉండే సిటీస్‌లో సింగిల్ గ్రాడ్యుయేట్స్ గురించి పట్టించుకొని ఆలోచించే వారు లేరక్కా!" అంటూ తన ఆవేదనని వ్యక్తం చేశాడు.

***

పై మూడు సంభాషణలు ప్రస్తుతం విద్యార్థులు విద్య అనంతరం వివాహాల సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలు. వీటిని జాగ్రత్తగా పరిశీలిస్తే గ్రాడ్యుయేట్స్ విద్యార్థుల తల్లిదండ్రులతో మంచి సంబంధాలు కలిగి ఉంటే పరిస్థితులు వేరుగా ఉంటాయని కూడా అర్థమవుతుంది. మన పరిచర్యలో విద్యార్థులు మన దగ్గర ఉన్నంతవరకే మనం కొంతవరకు పట్టించుకొంటున్నాం. తర్వాత వారి కెరీర్ గురించి, వివాహ విషయాల్లో చొరవ తీసుకోకుండా, వారి పరి స్థితులను అర్థం చేసుకోకుండా వదిలేయడం వల్ల పరిచర్యలో అనేకమంది గ్రాడ్యుయేట్స్‌ని, కుటుంబాల ను కోల్పోతున్నాం. పరిచర్యకు ధనాన్ని ఇచ్చినంతగా మన సమయాన్ని ఇవ్వలేకపోతున్నాము. మన సొంతపనుల మీద ఉన్న శ్రద్ధ విద్యార్థులు, యంగ్ గ్రాడ్యుయేట్స్‌మీద చూపించలేకపోతున్నాం. ఫిలిప్పీ 2:4లో చెప్పినట్లు "మీలో ప్రతివాడును తన సొంత కార్యములను మాత్రమేగాక, ఇతరుల కార్యముల ను కూడా చూడవలెను.. క్రీస్తుయేసుకు కలిగిన ఈ మనస్సు మీరును కలిగియుండుడి" అనే వాక్యము మన బోధలకు మాత్రమే పరిమితమౌతుంది.

"బాబూ, రమణి మా అమ్మాయి కాదు, మీ కూతురే అనుకోండి. తను మీ దగ్గరే చాలా విషయాలు నేర్చుకొంది. యేసుప్రభువును నమ్ముకొన్న దగ్గర నుంచి తన సంగతులన్నీ మీరే చూస్తున్నారు. మా కన్నా అన్ని విషయాలు మీరే బాగా ఆలోచిస్తున్నారు. మేము సంబంధం చూసినా తన జీవితానికి సరిపడదు గనుక మీరే ఆలోచించండయ్యా".

"చాలా సంతోషం అంకుల్ గారు, ఒక సంబంధం గురించి మాట్లాడటానికే వచ్చాము".

"మీరేది చెబితే అది చేయడానికి మేము సిద్ధం" అని రామయ్య గారు ఎంతో సంతృప్తితో అన్నాడు.

సంబంధం కుదిరిన తర్వాత రామయ్య గారు కానీ, వారి భార్య లక్ష్మీ గారు కానీ కులము, సంప్రదాయాలు గురించి అడగలేదు.

మన గ్రాడ్యుయేట్స్ ఇలాంటి పరిస్థితి



కల్పించుకోవాలంటే తల్లిదండ్రులతో సత్సంబంధాలు ఎంతో అవసరము.

## విద్యార్థుల తల్లిదండ్రులతో సత్సంబంధాలు ఎలా కలిగి ఉండాలి?

### ప్రార్థించాలి

పరిచర్య భారం కలిగిన ప్రతి ఒక్కరూ ప్రార్థిం చకుండా ఉండలేరు. క్రీస్తు స్వారూప్యం విద్యార్థుల్లో, యంగ్ గ్రాడ్యుయేట్స్‌లో ఏర్పడాలన్నా, వారు తమ జీవితంలోని అన్ని విషయాల్లో దేవునిచిత్తం నెరవేర్చాల న్నా మనం వారి కోసం తప్పకుండా ప్రార్థించాలి. అలాగే వారి తల్లిదండ్రుల గురించి తెలుసుకొని వారి గురించి క్రమం తప్పకుండా ప్రార్థించాలి. మనం ఒకరిని గురించి ప్రార్థిస్తున్నామంటే వారిని ప్రేమిస్తున్నామని అర్థం. ప్రేమలేని పరిచర్య వ్యర్థం.

### పరిచయాలు పెంచుకోవాలి

విద్యార్థులు లేదా సింగిల్ గ్రాడ్యుయేట్స్ యొక్క కుటుంబ నేపథ్యాన్ని తెలుసుకోవాలి వారి తల్లిదండ్రులతో పరిచయం పెట్టుకోవాలి. వారి దగ్గరికి వెళ్ళేటప్పుడు వీలైతే ఫ్రూట్స్ లేదా స్వీట్స్ తీసుకొని వెళ్ళి పరామర్శిస్తూ ఉండాలి. మన ఇంటిలో లేదా వాళ్ళ ఇంటిలో జరిగే ఫంక్షన్స్‌కు వారిని ఆహ్వానించడం, మనం వెళ్ళడంలాంటివి చేయాలి. ఈ క్రమంలో మన పరిచర్య ఎందుకు, ఎలా, ప్రత్యేకతలు మొదలైన వాటి గురించి అర్థమయ్యేలా చెప్పాలి.

### ప్రభువు ప్రేమను చూపించాలి

వాళ్ళు ఏదైనా ఇబ్బంది, బాధల్లో ఉన్నప్పుడు లేదా హాస్పటల్లో ఉన్నప్పుడు తప్పకుండా వారి ని దర్శించి వారికి ధైర్యం చెప్పాలి. సహాయం చేయాల్సి వస్తే ప్రేమతో చేయాలి. అప్పుడప్పుడూ వారి ఆరోగ్యం గురించి తెలుసుకోవాలి. వారి వ్యక్తిగత ప్రార్థనాంశాలు ఉంటే మనం తప్పకుండా వాటిని

తెలుసుకొని ప్రార్థించాలి. మేము మీ కొరకు ప్రార్థిస్తున్నాం అని చెప్పి ప్రోత్సహించాలి. మీ ఉద్యోగపరంగా వారికి మీ ఆఫీస్‌లో ఏదైనా పని ఉంటే సహాయం చేయడానికి ముందుండండి.

### ప్రయాసపడాలి

ప్రయాసలో కష్టం, నష్టం, త్యాగం ఉంటాయి. కొన్నిసార్లు సమయం, ధనం, తలాంతులు మొదలైన వాటిని త్యాగం చేయాల్సి ఉంటుంది. మీ ఇంటికి వారిని ఆహ్వానించి వారికి ఆతిధ్యం ఇవ్వండి. వాళ్ళ ఇంట్లో జరిగే ఫంక్షన్స్‌కి వీలైనంతవరకు హాజరవ్వండి. ఆ రోజు వీలు కాకపోయినా ముందురోజు గాని, తరువాత గాని వెళ్ళి, చిన్న గిఫ్ట్ ఇచ్చి కొంత సమయము గడిపి రండి. అదే సమయంలో మీ సాక్ష్య జీవితాలు కోల్పోవద్దు.

### పర్యవసానాల్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి

కొన్నిసార్లు మనమనుకున్నట్లు పరిస్థితులు ఎప్పుడూ మంచిగానే ఉంటాయని, తల్లిదండ్రులు చక్కగా రిసీవ్ చేసుకొంటారని ఊహించవద్దు. గడ్డు పరిస్థితులు కూడా ఎదురవుతాయి. సిద్ధంగా ఉండాలి.

ఒక స్టూడెంట్‌ని తల్లిలా ఆదరించినందుకు “ఈవిడే మా అమ్మాయిని మార్చేసింది. మత మార్పిడికి పాల్పడుతుందని పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ ఇచ్చింది. పోలీసులు అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తే ఆ గ్రాడ్యుయేట్ ఫ్యామిలీ 3 రోజులు ఇల్లు వదలి, వేరొక ఇంటిలో దాక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. కానీ, తర్వాత దేవుడు ఆ అమ్మాయి జీవితాన్ని అద్భుతంగా కట్టాడు. ప్రస్తుతం వారు కుటుంబంగా పరిచర్యలో పాల్గొంటున్నారు.

### విద్యార్థుల తల్లిదండ్రులతో సత్‌సంబంధాలు లేకపోతే వచ్చే నష్టాలేంటి?

1. తమ పిల్లలు ఎక్కడి వెళ్తున్నారో వారి తల్లిదండ్రులకు తెలియదు. ఇయు గురించి గాని, పరిచర్య విషయాలు గానీ వారికి తెలియవు. బైబిల్ స్టడీస్‌కి క్యాంప్స్, కాన్ఫరెన్స్‌లకు, విద్యార్థులను ప్రత్యేకంగా ఆడపిల్లలను ధైర్యముగా మనతో పంపలేకపోతున్నారు. వారి యొక్క కాన్ఫిడెన్స్‌ను గెలుచుకోలేకపోతున్నాము.
2. పరిచర్య గురించి తెలియకపోవడం వలన ప్రాముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవలసిన సమయంలో మా అబ్బాయి/అమ్మాయి కన్నా తల్లిదండ్రుల కన్నా వాళ్ళే (ఇజియఫ్) ఎక్కువైపోతున్నారు అనే కోపం ఏర్పడుతుంది. అందువలన వారికి మనమిచ్చే ప్రపోజల్స్ వారికి నచ్చవు.
3. ప్రేమించి పెళ్ళి చేసుకొంటున్నారనే ఉద్దేశం వారిలో కలుగుతుంది. ఇయులో అన్నీ ప్రేమ పెళ్ళిళ్ళే అనే ప్రచారం సాగుతుంది.
4. కట్నకానుకలు లేవనేసరికి చాలా నిరాశకు గురవుతున్నారు.
5. యంగ్ గ్రాడ్యుయేట్స్ తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా వివాహము చేసుకోవడం వలన ఆ ఇంటి కోడలు ఎప్పుడూ ఒక శత్రువుగానే మిగిలిపోతుంది.
6. యంగ్ గ్రాడ్యుయేట్స్ లేదా స్టూడెంట్స్ వారి తల్లిదండ్రులను ఎడ్యుకేట్ చేసినప్పటికి, తల్లిదండ్రులతో మనకు సత్సంబంధాలు లేకపోవడం వలన, “వీళ్ళు పిల్లల్ని తల్లిదండ్రుల నుంచి దూరం చేస్తున్నారనే నిందలు ఎదుర్కోవాలి.
7. వారితో మంచి సంబంధాలు లేకపోవడం వలన కొంతమంది విద్యార్థులను శాశ్వతంగా కోల్పోవలసి వస్తుంది. ప్రత్యేకముగా ఇతర విశ్వాసాల నుంచి వచ్చే విద్యార్థులు ఎక్కువ కష్టాలు ఎదుర్కొవాల్సి వస్తుంది.

### మన దగ్గరకు వచ్చే విద్యార్థుల నేపథ్యాలు ఎలా ఉంటాయి?

1. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయినవారు. “దేవుడెందుకు నా జీవితాన్ని ఇలా చేసాడు? అందరిలా దేవుడు నన్ను ప్రేమించడం లేదు” అనే నిరాశ నిస్పృహలో ఉన్న వారు ఉంటారు.
2. తండ్రి బతికుండి వదిలిపెట్టి వెళ్ళిపోయిన వారు. మగవాళ్ళంతా ఇంతే, అనే ఆలోచనలతో మగవాళ్ళంటేనే ద్వేషం, నా జీవితంలోకి మగవాడు ప్రవేశించకూడదు (వివాహానికి వ్యతిరేకమైన మనసు) అనే దృఢమైన నిర్ణయాలు కలిగిన అమ్మాయిలు.
3. తల్లిదండ్రులు చూపే పక్షపాత వైఖరికి లోనై చాలా గాయపడిన హృదయాలు కలిగినవారు.




4. సవతి తల్లిదండ్రుల, బంధువుల పెంపకంలో పెరుగుతూ ప్రేమకు నోచుకోనివారు.
5. ఆర్థిక, అనారోగ్య పరిస్థితులతో నిత్యమూ బాధింపబడుతూ ఉన్నవారు.
6. ఇతర విశ్వాస కుటుంబ నేపథ్యంగలవారు.
7. అక్రమ సంబంధాలు కలిగిన కుటుంబాల నుంచి వచ్చినవారు.

ఇలాంటి అనేకమైన నేపథ్యాల నుంచి వచ్చిన వారుంటారు. నేపథ్యాలు ఏవైనా వారు దేవుని మహాకృపను బట్టి క్రీస్తును అంగీకరించారు, వారికి కావలసింది తల్లి వంటి ఆదరణ. “ఒకని తల్లి వానిని ఆదరించునట్లు నేను మిమ్మును ఆదరించెదను”. యెషయా 66:13 అనే వాక్యభాగమును చదువుకొంటూ ఆదరింపబడుతున్న మనము అదే ఆదరణ విద్యార్థుల పట్ల చూప బద్ధులమైయున్నాము. బైబిల్‌లో 13 పత్రికలు రాసిన గొప్ప దైవజనుడైన పౌలు వెనుక ఒక తల్లి ఆదరణ (ఆయన బలహీన పరిస్థితులలో) ఉందని మరచిపోవద్దు (రోమా 16:13).

### ముగింపు

ఈ బిజీ ప్రపంచంలో మనకసలు తీరిక లేకపోవచ్చు గానీ విద్యార్థుల తల్లిదండ్రులతో సత్సంబంధాలు కలిగి ఉండడం కూడా పరిచర్యలో భాగమేనని ఎరిగి పరిచర్యను విజయపథంలో నడిపిద్దాం. దేవుడు మనకు ఈ సెల్‌ఫోన్ ఒక బహుమానంగా ఇచ్చాడు. దీనిని అనవసరంగా ఉపయోగించక విద్యార్థుల జీవితాలను కట్టడానికి ఉపయోగిద్దాం.

– **యానీ అనురాధ,** భీమిలి

**కవిత**

# ఒక్కళ్ళమే అయితే?




జీవితాన్ని భుజానికెత్తుకొని
చీకటి లోకంలో చిక్కుకొని ఉన్న మాకు
సరైన దారి చూపించారు
చేయి పట్టుకొని చక్కగా నడిపించారు
ఇరుకు మార్గంలో
మాకు ముందుగా మీరు వెళ్తుంటే
ముళ్ళ కంపలు, రాళ్ళదెబ్బలూ అన్నీ మీ కాళ్ళకే
మేమొక్కళ్ళమే అయితే
ఎంత దూరం వెళ్ళేవాళ్ళం ?
ఏ సంబంధమూ లేకపోయినా
ప్రేమే బంధమన్నారు
అయిన వారందరికీ దూరమైనపుడు
అన్నీ మీరై ఆదరించారు
అంతా అయింతర్వాత
‘మీరెంత ?’ అన్నట్టు ప్రవర్తించినా
మా తెలియనితనం తెలిసిన మీరు
చిరునవ్వు వెనుక అన్నీ సహించారు
శాంతమూర్తులై మమ్మల్ని క్షమించారు !!
మేము క్రీస్తునెక్కడ చూశాం ?
మిమ్మల్నే మేము గమనించాం !
ఆయన స్వరూపాన్ని మీరు ధరించుకొని
నడుముకు తువ్వాలు చుట్టుకొని
మా పాదాలు కడగడానికి ఉపక్రమించినపుడు
జీవించడం మీనుంచే నేర్చుకున్నాం !!

– **డా. తాళ్ళూరి ప్రసాద్**

ప్రత్యేకం

# పరిచర్యలో ప్రమాదాలు



మన రక్షకుడైన యేసుప్రభువు సర్వమానవాళి రక్షణ కొరకు చనిపోయి, తిరిగిలేచి అందరికి 'రక్షణ' ప్రసాదిస్తే, ఆ రక్షణ సువార్త మన అందరికి అర్థమయ్యేరీతిలో ప్రకటించి, ప్రయాసపడి పనిచేసిన వ్యక్తి అపొస్తలుడైన పౌలు. పౌలు సేవ చేయడమే గాక, సేవ ఎలా చెయ్యాలి? సేవలో ఎదుర్కొనే ప్రమాదాలు ఏంటి? నకిలీ సేవను ప్రక్కనపెట్టి, నికరమైన సేవ, దేవునికి ప్రీతికరమైన సేవ ఎలాచేయాలో రాశాడు. మనం చేసే విద్యార్థి సువార్త సేవ గూర్చి పౌలు రాతల నుంచి కొన్ని విషయాలు నేర్చుకొందాం (1 థెస్స 2:1-16).

## క్రైస్తవ పరిచర్య అనగా?

క్రైస్తవులు ఈ లోకంలో యేసుక్రీస్తు లక్ష్యాలను ముందుకు తీసుకొని వెళ్ళడం, తోటి ప్రజలను ప్రభావితం చేసి వారి పట్ల దేవుని ఉద్దేశం నెరవేరేటట్లు పనిచేయడమే క్రైస్తవ పరిచర్య. మనుష్యులందరు రక్షణ పొందాలనేది దేవుని ఉద్దేశం, దాని కొరకు ప్రయాసపడడమే మనం చేయవలసిన పరిచర్య (1 తిమోతి 2:4).

## రక్షణ సువార్త పరిచర్య చేయడానికి గల కారణాలు

1. పైనుండి ఇవ్వబడిన దేవుని ఆజ్ఞ (మత్తయి 28:18-20)
2. పాతాళం నుంచి వస్తున్న కేకలు (లూకా 16:24-26).
3. దూరం నుంచి వస్తున్న విజ్ఞాపన (అ.కా. 16:9)
4. విశ్వాస హృదయంలో నుంచి వస్తున్న ఒత్తిడి (2 కొరింథీ 5:14).

పై కారణాలను బట్టి దేవుని నమ్ముకొన్న వ్యక్తి పరిచర్య చేయకుండా ఉండలేడు. రక్షణ సువార్త పరిచర్య విశ్వాసి యొక్క లక్ష్యమై ఉంటుంది.

## పరిచర్యలో ప్రమాదాలు

మొదటిగా, పరిచర్యలోని ప్రమాదాలను గుర్తించి ముందుకు సాగినప్పుడు, దేవునికి ప్రీతికరమైన సేవ చేయడానికి వీలవుతుంది.

1. **భ్రాంతి కలుగజేయడం:** కపటమైన ఆలోచన కలిగి, ప్రజలను మోసం చేసి, తన సొంత ఉద్దేశాలను దేవుని ఉద్దేశాలుగా ప్రకటించి భ్రాంతి కలగజేయడం.
2. **అపవిత్ర ఉద్దేశాలు:** పవిత్ర సేవ చేస్తున్నట్టుగా నటిస్తూ, రహస్యంగా అపవిత్రమైన కోరికలు నెరవేర్చుకోవడానికి ప్రాకులాడడం.

3. **మోసం చేయడం:** దేవుని పేరుతో ఉపాయాలు (ట్రిక్స్) చేసి ఆస్తులు సంపాదించుకొని, లోకరీతిగా జీవిస్తూ దేవుని ప్రజలను మోసం చేయడం.
4. **ముఖస్తుతి:** దేవుని సత్యాల విషయంలో రాజీపడి సొంత లాభం కోసం మనుష్యులను సంతోషపరచడమే లక్ష్యంగా సాగడం.
5. **ధనాపేక్ష:** ఎంతో భారం కలిగి పనిచేస్తున్నాను, ధనం చాలా అవసరం అని ధనసంపాదనే సేవా లక్ష్యంగా సాగడం.
6. **వ్యక్తిగత ఘనత:** ఏ పనిచేసినా, ప్రతిచోట వ్యక్తిగత ఘనత, తోటివారి పొగడ్తలు కోరుకోవడం.
7. **తన మాటే చెల్లుబాటు కావాలి:** దేవుని మాటకంటే అందరూ తన మాటను విని తన అధికారాన్ని గుర్తించి మసులుకోవాలనే ప్రయత్నాలు.

పౌలు చెప్పిన ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని మన పరిచర్యలో పొంచివున్న ప్రమాదాలను కూడా గుర్తిద్దాం.

1. **ఫాలోఅప్ చేయకపోవడం:** కష్టపడి గాస్పెల్ మీటింగ్స్, రిట్రీట్స్ పెట్టి, రక్షణ సువార్త వినిపిస్తాం. అంతటితో నా పని అయిపోయింది అన్నట్లుగా, రక్షణ తీర్మానం చేసిన వారిని పట్టించుకోవడం లేదు. వారి పేర్లు రాసుకొని ప్రార్థించడం, వారిని దర్శించడం, సహవాస స్నేహాలను పెంచుకోవడం, వారిని పట్టించుకోవడం (కేరింగ్) మర్చిపోయాం. వారు వచ్చినా సమయం ఇవ్వకపోవడం. కూర్చొబెట్టి బైబిల్ సత్యాలు చెప్పకపోవడం.
2. **మెంటరింగ్ చేయాలన్న ఆశ లేకపోవటం:** పౌలు – తిమోతి, తీతు, ఫిలేమోను ఇలా అనేకమందిని మెంటరింగ్ చేసి నాటి ప్రపంచాన్ని కదిలించారని తెలిసినా, మన ఇయు, ఇజియుఫ్‌లలో మెంటరింగ్‌ను విస్మరించడం ద్వారా పరిచర్యను భవిష్యత్‌లో నడిపే నాయకులను కోల్పోతున్నాం. ఇలానే కొనసాగితే ఆత్మీయ నాయకత్వపు లేమి చూడక తప్పదు.
3. **విద్యార్థులకు పరిచర్య దర్శనాన్ని, భారాన్ని అందించకపోవడం:** మనం ప్రార్థనాపూర్వకంగా పరిచర్య చేస్తూ ఉంటే, దానిని గమనించిన విద్యార్థులు, యువ గ్రాడ్యుయేట్స్ ఆ దర్శనాన్ని అందుకోవటానికి ఆశపడతారు. కేవలం ప్రోగ్రామ్స్‌కే పరిమితమైతే, ఈ విద్యార్థి పరిచర్య కుంటుపడక తప్పదు. దేవుడు మనకిచ్చిన దర్శనాన్ని మరిచిపోతే గురితప్పినవాళ్ళం అవుతాం.
4. **గుర్తింపు కోసం ప్రాకులాడడం:** సమాజంలో ఉన్న ధనము, కులము, హోదా మొదలైన వాటిని బట్టి ఆత్మీయ సేవలో, సభలలో గుర్తింపు కోసం ప్రాకులాడడం ఆత్మీయ జీవిత దిగజారుడుకు గుర్తని గుర్తిద్దాం.
5. **సమయాన్ని ఇవ్వకపోవడం:** సొంత కార్యాలకు ఇచ్చినంత సమయం దేవుని కార్యాలకు, దేవుని బిడ్డలను ప్రోత్సహించడానికి ఇవ్వకపోవడం గొప్ప ప్రమాదమే. సమయం ఇవ్వకపోతే సహవాసం ఎలా వృద్ధి చెందుతుంది? సహవాసం లేకపోతే పరిచర్య ఎలా బలపడుతుంది? లేక విస్తరిస్తుంది? ప్రశ్నించుకొందాం.
6. **నా మాటే నెగ్గాలనే ధోరణి:** ఒకరినొకరు ఘనపరచుకోవడం మానేసి, నేను చెప్పిందే కరెక్ట్, నేను చెప్పిన వారికే బాధ్యతలు ఇవ్వాలి అనే కమాండ్, డిమాండ్‌లు ఎక్కువైపోయాయి. ఇక కలిసి నడవడం ఎలా సాధ్యమౌతుంది.
7. **దైవిక ప్రేమ, త్యాగం కొరవడడం:** తోటివారి ని చూచినప్పుడు మన హృదయంలో నుంచి ఉప్పొంగి రావలసిన ప్రేమ, ఆప్యాయత ఇప్పుడు ఉన్నాయంటారా? త్యాగం సంగతి ఏంటి? ఆలోచిద్దాం.

ఇలా ఎన్నో ప్రమాదాలు మన పరిచర్యలో చోటుచేసుకొని సేవ పతనావస్థకు చేరకముందే, పౌలు చూపిన మాదిరిలో మనం కూడా నడిస్తే మన పరిచర్య నాలుగు కాలాలపాటు నిలబడుతుంది.

## ప్రభువు మెచ్చే పరిచర్య విధానం

పౌలు, సీలలు థెస్సలోనికయలో బెదిరింపులు, అల్లరి ని ఎదుర్కొని సేవ చేసిన ఫలితంగా థెస్సలోనీకయులు బలపడి, వాక్యాన్ని మాసిదోనియలోను, అకయలోను మోగించారు. పౌలు, సీలలు థెస్సలోనీకయలో చేసిన పరిచర్య మాదిరిని చూద్దాం.

1. **నిస్వార్థమైన పరిచర్య:** ధనము, అధికారం తన సొంత ప్రయోజనాల కొరకు వాడుకొనక, దేవుని పేరుతో ప్రజలను దోచుకొనక, తనకున్నదంతా దేవుని పరిచర్యలో ఖర్చు పెట్టగలిగినప్పుడు ఆ పరిచర్య నాలుగు కాలాలపాటు నిలబడుతుంది.
2. **మృదువైన పరిచర్య:** పాలు ఇచ్చు తల్లి తన సొంత బిడ్డలను గారవించునట్లుగా దేవుడు మనకిచ్చిన పరిచర్య చేయాలి. ఈ రోజుల్లో అలా చేయడం సాధ్యమా? సాధ్యమే, లేకపోతే పరిశుద్ధాత్మ దేవుడు మనకు రాయించి ఇచ్చేవాడు కాదు. తల్లి నిద్ర, ఆహారాలను, సొంత పనులను పక్కనపెట్టి, సొంత బిడ్డల క్షేమము కొరకు సేవ చేసినట్లుగా పరిచర్య చేసినప్పుడు ఆ పరిచర్య వర్థిల్లుతుంది.
3. **తెగింపుతో కూడిన పరిచర్య:** అవసరమైతే ప్రాణాలను కూడా అర్పించి పరిచర్య చేయాల్సి రావచ్చు. ఆ సమయంలో సువార్త నిమిత్తం తెగించి పనిచేయాలి. పరిచర్య కొనసాగించాలి. ఇష్టపడినప్పుడు తెగింపు వస్తుంది. ప్రభువు సంతోషిస్తాడు.
4. **ఇతరులపై ఆర్థిక భారం మోపని పరిచర్య:** ఈ రోజుల్లో ఒక గంట సువార్త సభ నిర్వహించడానికి లక్ష రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. నిర్వాహకులకు చాలా భారంగా ఉంటుంది. అయితే సొంతంగా కష్టం చేసుకొని జీవనం చేసుకొంటూ సువార్త ప్రకటిస్తే ఆర్థిక భారం ఇతరులపై లేకుండా ఉంటుంది.
5. **పవిత్రమైన పరిచర్య:** దేవుని పరిచర్య పవిత్రముగా, నీతిగా, భక్తిగా, ఇతరులు నిందించని విధముగా ఉన్నప్పుడు, ఆ పరిచర్య శక్తివంతముగాను, చూచినవారు భయభక్తులు కలిగి దేవుని సేవించడానికి ప్రోత్సహిస్తుంది.
6. **దేవుని ప్రణాళికాబద్ధమైన పరిచర్య:** సర్వ మానవాళి పట్ల దేవుని ప్రణాళిక, రక్షణ కార్యం నెరవేరడానికి దేవుని హృదయ స్పందన యెరిగి, దేవుని చిత్తానుసారంగా పరిచర్య చేయాలి. సొంత ప్రణాళికలను పక్కనపెట్టి దేవుని ప్రణాళికకు తలవంచి పనిచేద్దాం.
7. **సంరక్షించే పరిచర్య:** తండ్రి తన బిడ్డలను ప్రతి ప్రమాదము నుంచి కాపాడడమే కాక, వారి బాగోగులను గూర్చి ఎప్పుడూ ఆలోచిస్తూ హెచ్చరిస్తూ, ప్రోత్సహిస్తూ, భారాన్ని తానే భరిస్తూ, పిల్లల ప్రయాణాన్ని సులువు చేస్తూ ఉంటాడు. ఆత్మీయ బిడ్డల పట్ల అటువంటి సంరక్షణ చూపించాలి.
8. **వాక్య కేంద్రిత పరిచర్య:** పరిచర్యకు పునాది దేవుని వాక్యమే. దేవుని వాక్య కేంద్రముగా మన పరిచర్య ఉండాలి. మానవ పద్ధతులు, ఆచార అలవాట్లకు చోటులేని విధముగా వాక్యానుసారంగా సేవ చేయాలి. దేవుని వాక్యం స్థిరమైనట్లుగా ఆ వాక్యాన్ని స్వీకరించిన వారు కదలనివారుగాను, స్థిరముగా ఉంటారు.
9. **శ్రమలలో ధైర్యవంతమైన పరిచర్య:** పిరికితనం ప్రభువు పనిలో పనికిరాదు. శ్రమలు వస్తాయి. వాటిని చూచి భయపడక, ప్రభువును చూచి ధైర్యం తెచ్చుకొని దేవునిపైనే పూర్తిగా ఆధారపడి ధైర్యంగా పరిచర్యను చేయాలి. మనకు ముందు నడిచిన భక్తులు జీవిత చరిత్రను చూచి ధైర్యం తెచ్చుకొని ధైర్యంగా ముందుకు సాగుదాం.

## స్వపరీక్ష చేసుకొని, సరిదిద్దుకొని, సాగిపోదాం

1. దురాశతో నిండిన లోకపు పోకడలు మనలో చోటుచేసుకొన్నాయా?
2. ఆధునిక జీవిత ఒత్తిళ్ళకు లోనవుతున్నామా?
3. 'డోన్ట్ డిస్టర్బ్ మి' అనే జీవన విధానం ప్రారంభించామా?
4. సత్వర సంతృప్తి పొందాలని చూస్తున్నామా?
5. దేవుని స్వరం వినడం మానేశామా?
7. ప్రార్థనా జీవితాన్ని విస్మరిస్తున్నామా?
8. అనుదిన జీవితంలో దేవుని నడిపింపు కోల్పోతున్నామా?
9. రక్షణానందం జీవితంలో కొరవడిందా?
10. అనుదిన జీవిత పనిపాట్లలో పరిశుద్ధత సంగతి మర్చిపోయామా?

## ముగింపు

విశ్వాసికి పరిచర్య ఆప్షన్ కాదు దేవుడిచ్చిన గొప్ప ఆధిక్యత. దేవునికి లెక్క చెప్పవలసినవారం గనుక భయముతోను, వణుకుతోను, పరిశుద్ధమైనరీతిలో దేవునికి ప్రీతికరమైన పరిచర్య చేయుదుముగాక!

– **ఆర్.ప్రభుదాస్,** తెనాలి

ప్రత్యేకం

# త్యాగపూరితంగా ఇద్దాం

ఛార్లెస్. టి. స్టడ్, గొప్ప ధనవంతుడు, క్రికెటర్, చైనా దేశానికి మిషనరీగా వెళ్ళినవాడు. ఒకరోజు 'మీలో తనకు కలిగిన సమస్తమును విడిచిపెట్టని వాడెవడునూ నాకు శిష్యుడు కానేరడనే' వాక్యాన్ని ధ్యానిస్తుండగా దేవుడు తనతో ఇలా మాట్లాడాడు.


దీర్ఘకాలం జీవించాలని ఆశపడకు – క్రీస్తు కొద్దికాలమే జీవించాడు.

భోగలాలసుడవై ఉండకు – క్రీస్తు పేదరికంలో జీవించి చనిపోయాడు.

ఆహ్లాదకరమైన జీవితాన్ని గడపకు – క్రీస్తు తన్ను తాను సంతోషపెట్టుకొనలేదు.

పేరు ప్రఖ్యాతులను ప్రేమింపకు – క్రీస్తు పేరు ప్రఖ్యాతులను ప్రేమింపలేదు.

సుఖవంతమైన జీవితం గడపకు – క్రీసు నీ కొరకు శ్రమపడి సిలువను, కొరడా దెబ్బలవలన సిగ్గును వహించాడు.



"యేసుక్రీస్తు దేవుడై ఉండి, నా కొరకు మరణించినట్లయితే, ఆయన కొరకు నేను చేసే ఏ త్యాగమూ గొప్పది కాదు."

దేవుడు తనతో మాట్లాడిన దాన్ని బట్టి సమస్తాన్ని త్యాపూరితంగా దేవునికి ఇచ్చి క్రీస్తును వెంబడించడానికి, విశ్వాసంతో జీవించడానికి తీర్మానించుకొన్నాడు.

దేవునివాక్యంలో, సంఘ చరిత్రలో, యుఇయస్ఐ లో త్యాగపూరితంగా దేవునికి ఇచ్చినవాళ్ళు ఎంతో మంది ఉన్నారు.

## త్యాగపూరితంగా ఇవ్వడం అంటే?

త్యాగపూరితంగా ఇవ్వడం అంటే శక్తికి లేదా సామర్థ్యానికి మించి ఇవ్వడం. మన వద్ద ఉన్నది ఇవ్వడం కాదు గానీ మనకు అవసరమైనది, మనకు కావలసినది మరొకరి అవసరాలకు సరఫరా చేయబడటమే. అంటే ఇది ఇతరుల, దేవుని పనిలో తక్షణ అవసరాలు తీర్చేదిగా ఉంటుంది.

మాసిదోనియా సంఘం వారి సామర్థ్యానికి మించి దాతృత్వాన్ని చూపించింది. వారు శ్రమల్లో అత్యధికంగా సంతోషిస్తూ, ఇష్టపూర్వకంగా, స్వచ్ఛందంగా ఇచ్చి పరిశుద్ధులకు జరిగించిన ఈ పరిచర్యలో పాల్గొనే ధన్యతను పొందారు. ఈ క్రమంలో వారి పేదరికం అడ్డుగా మారలేదు (2 కొరింథీ 8:2).

బీద విధవరాలు రెండు నాణెములు లేక కాసులే ఇచ్చినప్పటికీ అవి ఎంతో గొప్పవిగా ప్రభువు లెక్కించాడు. తన భవిష్యత్‌ను ప్రభువు చేతిలో పెట్టి తనకున్నదంతయు దేవునికి, దైవసేవకు ఇచ్చింది (లూకా 21:1-9). ఎంత పెద్ద మొత్తం ఇచ్చామన్నది ముఖ్యం కాదు, కలిగినదానిని బట్టి ఎంత త్యాగపూరింగా ఇస్తున్నామనేదాన్ని ప్రభువు లెక్కిస్తాడు.

త్యాగపూరితంగా ఇవ్వడం అంటే, ఇవ్వడం మనల్ని బాధించాలి.

## త్యాగపూరితంగా ఇవ్వడంలో ప్రభువు మాదిరి

ఇవ్వడంలో దేవుడే మనకు గొప్ప మాదిరి.

ఆదికాండం 1వ అధ్యాయంలో సమస్తమును మన కొరకు, మన నిమిత్తం సృజించారు. ఇందులో ప్రేమ ఉంది. ఆయన మనకు సమస్తమును ధారళంగా, విస్తారంగా ఆయన కృపను బట్టి ఉచితముగా ఇచ్చాడు, ఇస్తున్నాడు, ఇస్తూనే ఉంటాడు. క్రమం తప్పక నీతిమంతులైనా అనీతిమంతులైనా అందరికి ఇస్తూనే (మత్తయి 5:45) ఉన్నాడు. మనం ప్రేమించకపోయినా తానే మనలను ప్రేమించి అనుగ్రహించారు. ఆయన మనకు అనుగ్రహించినవి ఎంతో విలువైనవి, శ్రేష్టమైనవి, మరియు అమూల్యమైనవి.

దేవుడు తన ఒక్కగానొక్క, ఏకైక కుమారుడిని మన రక్షణార్థం మన పాపముల నుంచి విడుదల నిమిత్తం, నిత్యజీవంలో ప్రవేశించుటకు ఆయనను మనకు అనుగ్రహించాడు. క్రీస్తు తన్నుతాను తగ్గించుకొని, రిక్తునిగా చేసుకొని సిలువ మరణం పొంది (ఫిలిప్పీ 2:6-8). తనకు తానుగా అర్పించుకొన్నారు (ఎఫెసీ 5:1). ఆయన సిలువలో చేసిన త్యాగపూరిత కార్యం ద్వారా, దాన్ని విశ్వసించడం ద్వారా మనకు గొప్ప రక్షణ, నిత్యజీవం, దేవునితో సహవాసం, సమాధానం లభించాయి. మనలో ఉండడానికి పరిశుద్ధాత్ముని, ఆత్మవరాలు, ఫలాలు ఇచ్చాడు.

ఆఫ్రికా ఖండానికి మిషనరీగా వెళ్ళిన డేవిడ్ లివింగ్‌స్టోన్ ఇలా అంటాడు. "నా జీవితంలో ఎక్కువ భాగం ఆఫ్రికాలో గడిపినందుకు నేను చేసిన త్యాగం గురించి ప్రజలు మాట్లాడుకొంటారు. మనం ఎప్పటికీ దేవునికి తీర్చుకోలేని గొప్ప రుణంలో కొంత భాగాన్ని మాత్రమే తిరిగి చెల్లిస్తే దానిని త్యాగం అని పిలవవచ్చా?... ఇది ఖచ్చితంగా త్యాగం కాదు. మన కోసం తనను తాను అర్పిం చుకోవడానికి తన సింహాసనాన్ని విడిచిపెట్టిన ఆయన చేసిన గొప్ప త్యాగాన్ని గుర్తుచేసుకొన్నప్పుడు మనం ఏ త్యాగం గురించి మాట్లాడకూడదు".

ఇచ్చే విషయంలో మనం దేవునిని ఎన్నడూ మించిపోలేము. ఆయన ఇస్తాడు, ఇస్తాడు, క్షమిస్తాడు. కానీ సమస్య మనతోనే. మనం పొందుకొంటాము, పొందుకొంటాము, మరచిపోతాము. ఎంత విచారకరం!

## ఇవ్వడంలో బైబిల్‌లోని వ్యక్తుల మాదిరి

- ❖ హేబేలు శ్రేష్టమైనవి అర్పించాడు (ఆది 4:4)
- ❖ అబ్రహాము ఒక్కగానొక్క కుమారుడిని బలి ఇవ్వడానికి ఇష్టపడ్డాడు (ఆది 22:9)
- ❖ యెఫ్తా తను చేసిన మొక్కుబడి ప్రకారం కుమార్తెను దహనబలిగా అర్పించాడు (న్యాయా 11:39)
- ❖ దేవుని మందిరం నిమిత్తం ఇశ్రాయేలీయులు పూర్ణమనస్సుతో ఇచ్చారు (1 దిన 29:9).
- ❖ బీద విధవరాలు తన లేమిలో, తనకు కలిగిన జీవనమంతయు ఇచ్చింది (లూకా 21:4).
- ❖ ఒక స్త్రీ విలువైన అత్తరు ఆయన పాదములపై పోసి ఆరాధించింది (మత్తయి 26:7)
- ❖ ఆది అపోస్తలులు ఎవడును తనకు కలిగిన వాటిలో ఏదియు తనదని అనుకొనలేదు... వాని వాని అక్కర కొలది పంచిపెట్టిరి (అ.కా. 4:32-35).
- ❖ దొర్కా అవసరతలో ఉన్నవారికి వస్త్రాలు కుట్టి ఇవ్వడం (అ.కా. 9:36-39).
- ❖ ఫిలిప్పీయులు పౌలుకు తన అవసరతలో మాటి మాటికి సహాయం చేయడం (ఫిలిప్పీ 4:16)

## ఇవ్వడంలో మన పితరుల మాదిరి

ప్రొ. ఇనాక్‌గారు తన ధనాన్ని అంతా దేవుని సేవకు, అడిగిన వారికి త్యాగపూరితంగా ఇచ్చేవాడు. కాదనకుండా వారి సమయాన్ని, ఇంటిని, జీవితాన్ని విద్యార్థుల పరిచర్య కొరకు వెచ్చించాడు. స్టైరెట్ గారు కోటగిరి హైఫీల్డ్‌లోని తన స్వంత స్థలాన్ని యుఇయఎస్ఐ స్టడీసెంటర్‌కు త్యాగపూరితంగా ఇచ్చాడు. నంబూరు స్టడీ సెంటర్‌కు ఆనుకొని ఉన్న తమ స్థలాల్ని కొంతమంది గ్రాడ్యుయేట్స్ త్యాగపూరితంగా పరిచర్యకు ఇచ్చారు.



ఇలా ఎంతోమంది వారి సమయాన్ని, ధనాన్ని, తలాంతులను దేవుని కొరకు త్యాగపూరితంగా ఇస్తున్నారు. వారి అర్పణ, సమర్పణ, త్యాగసహిత జీవితాల్లో నుండే మనం వచ్చాము, వాటిని రుచి చూశాము.

మనం దేవుని పరిచర్యకు అవసరమైనవి, మనకు ప్రియమైనవి, బాగా ఇష్టపడేవి, మిక్కిలి విలువైనవి ఇవ్వాలి. ఇతరుల అక్కర కొలది, మాటిమాటికీ ఇవ్వాల్సి వస్తుంది. ఇందులో దేవుని ప్రేమ దాగి ఉంది. ఇవ్వడం అనేది మన భక్తి జీవితంలో ఒక మెట్టు. ఇవ్వడంలో ఆనందం ఉంటుంది. త్యాగపూరితంగా ఇవ్వడంలో మహానందం ఉంటుంది.

### విశ్వాసిగా మనం దేవునికి ఇవ్వాల్సినవి

2 కొరింథీ 8:5లో ఇలా ఉంది. "ఇదియుగాక మొదట ప్రభువుకును, దేవుని చిత్తము వలన మాకును, తమ్మును తామే అప్పగించుకొంటిరి. ఇంతగా చేయుదురని మేమనుకొనలేదు". క్రైస్తవ దాతృత్వానికి ఈ విషయం చాలా కీలకమైన సూత్రమని యన్ఐవి స్టడీ బైబిల్‌లో ఉన్నది. నీ సమయంలో, నీ తలాంతులలో, నీ డబ్బులో నీవు ఉన్నావు. వాటి నుంచి నిన్ను నీవు వేరుపరచు కోలేవు. వాటిని నీవు దేవునికి ఇవ్వకపోతే, నిన్ను నీవు దేవునికి ఇవ్వనట్లే. గనుక కలిగినవి అన్నీ అంటే సమయం, ధనం, తలాంతులు, చదువు, తెలివి, జ్ఞానం, పదవులు, ఉద్యోగాలు, వరాలు, తలాంతులు, వస్తు, వాహనాలు... సమస్తం ఆయన ద్వారానే పొందాము (ద్వితీ 8:48). అవన్నీ ఆయనకే ఇవ్వాలి. రోమా 12:1 ప్రకారం సజీవయాగంగా మనల్ని మనం ఆయనకు సమర్పించుకోవాలి.

ఒక భక్తుడు ఇలా అన్నాడు. "అడిగినవాడు సేవకుడే కాదు, ఇవ్వనివాడు విశ్వాసే కాదు.

### దేవుని పరిచర్యకు ఎలా ఇవ్వాలి?

సణుగుకొనక, బలవంతంగా కాక (2 కొరింథీ 9:7), హృదయంలో నిశ్చయించుకొనినవి, ఉత్సాహంగా, నిండు మనసుతో (లూకా 6:30), రహస్యముగా (మత్తయి 6:3), సిద్ధమనసు కలిగి, కలిమి కొలది (2 కొరింథీ 8:11) ఇవ్వాలి. పుచ్చుకొనుటకంటే ఇచ్చుట ధన్యము (అ.కా. 20:35) పుచ్చుకోవడానికే ఎక్కువ ఇష్టపడతాం, ఆశపడతాం, ఆరాటపడతాం. కాని ఇవ్వడంలో ఉన్న ధన్యత అనుభవిస్తే అర్థమవుతుంది.

త్యాగపూరితంగా ఇవ్వడం అంటే మనకున్న వాటిలో ఒకటి ఇవ్వడం, ఉన్నవారికే ఇవ్వడం, ఇచ్చేవారికే ఇవ్వడం, పెట్టేవారికే పెట్టడం కాదు. మనకు తిరిగి ఇవ్వలేని వారికి ఇవ్వడంలో కూడా త్యాగం, నిస్వార్థం కనిపిస్తాయి. మిగిలిపోయిన వాటిని, అవసరంలేని, మనకు పనికిరాని వాటిని, మన సమృద్ధిని బట్టి ఇవ్వడం త్యాగం కాదు. ఇతరుల అవసరాలలో సహాయపడుతున్నామంటే వారి పట్ల ఉన్న ప్రేమ వల్లనే. ఆయన ద్వారా పొందిన సమస్త మునూ ఆయనకే సమర్పించ బద్ధులమైయున్నాము. అవి ఆయనవే గాని మనవి కాదు. ఇందులో బాధపడాల్సిన, దు:ఖపడాల్సిన, నొచ్చుకోవాల్సిన, సణుగుకోవాల్సిన అవసరం లేదు.

### దేవుని పరిచర్యకు ఎలా ఇవ్వకూడదు?


దేవునికి ఇచ్చే విషయంలో స్వంత ఘనతను ఆశించి గానీ, మెప్పు కొరకు గానీ ఇవ్వకూడదు. మనం ఒకటి ఇస్తే దానికి రెండంతలు దేవుడు ఇస్తాడన్నది లెక్కలేసుకొనేతత్వం స్వార్థపూరితం. అనేకమంది విశ్వాసుల్లో, నామకార్థులలో ఈ అభి ప్రాయం నరనరాల్లో జీర్ణించుకుపోయింది. చాలా సంఘాలు, బోధకులు కూడా ఈ విషయం జీర్ణించు కొనిపోయేలా బోధలు చేస్తూ తమ ఆస్తులు పెంచుకొంటున్నారు.

### ముగింపు

ఇవ్వడంలో మూడు స్థాయిలు ఉన్నాయి. మన సామర్థ్యం కంటే తక్కువ, మన సామర్థ్యాన్ని బట్టి, మన సామర్థ్యానికి మించి ఇవ్వడం. పాశ్చాత్య దేశంలో క్రైస్తవులు 96% మంది తమ సామర్థ్యం కంటే తక్కువగాను, 3% మంది వారి సామర్థ్యాన్ని బట్టి, 1% కంటే తక్కువ మంది వారి సామర్థ్యానికి మించి ఇస్తారు. మన పరిస్థితి ఏంటి?

ఆయన మనకు చేసిన దాన్ని బట్టి ఏమివ్వగలం? ఆయనకు సజీవయాగంగా సమర్పించుకోవడం తప్ప. గనుక ఆయన మనకు ఇచ్చిన దానిలో ఆయన పరిచర్యకు, అవసరతలో ఉన్నవారికి త్యాగపూరితంగా ఇవ్వడంలో విస్తరిద్దాం. అప్పుడు పరిచర్యలోని అన్ని కొరతలు తీర్చబడతాయి.

– బి. రవికుమార్, ప్రియాంకిని, కారంపూడి





# ఎక్విప్ అవుదాం

సాహస యాత్రలకు హిమాలయాలకు వెళ్ళే వారిని గమనిస్తే వారి ప్రయాణానికి తగినట్లుగా బట్టలు, బూట్లు, తిండి పదార్థాలు సమకూర్చుకొంటారు. మంచును తట్టుకోవడానికి, ప్రయాణంలో వచ్చే అనుకోని సంఘటనలను ఎదుర్కోవడానికి మానసికంగా, శారీరకంగా ఎంతో సిద్ధపడతారు. లేకపోతే వారి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది.

టీచర్స్ కూడా పాఠం చెప్పడానికి ప్రతిరోజు టీచింగ్ ఎయిడ్స్, నోట్స్‌తో ఎంతో సిద్ధపడతారు. ఒక సైనికుడు యుద్ధానికి కావాల్సిన వాటిని సమకూర్చుకొని యుద్ధానికి సన్నద్ధమవుతాడు. ఒక ఉద్యోగి తన ఉద్యోగంలో రాణించడానికి, పోటీ ప్రపంచంలో రోజూ ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోవడానికి తనను తాను ఎంతో ఎక్విప్ చేసుకొంటాడు. ఇలా ఏ రంగంలో చూసినా మారుతున్న సమాజంలో, దానికి అనుగుణంగా తమ్మునుతాము ఎక్విప్ చేసుకొనేవారు కనిపిస్తారు. అలా చేసుకోకపోతే వారిని 'కాలంచెల్లిన' వారిగా పిలుస్తారు. మన విద్యార్థుల పరిచర్యలో కూడా విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్‌గా ఎప్పటికప్పుడు మనల్ని మనం అన్నివిషయాల్లో ఎక్విప్ చేసుకొని ప్రభువు పనిలో పాల్గొనాలి.

## ఎక్విప్ చేసుకోవడం అంటే?

ఎక్విప్ అనే మాట బైబిల్‌లో అనేకసార్లు ప్రస్తావించబడింది. నూతన నిబంధనలో పౌలు, హెబ్రీ గ్రంథ కర్త ఈ పదాన్ని హెబ్రీ విశ్వాసులను గూర్చిన ప్రార్థన సంపూర్ణత, సంపూర్ణులగుటను సూచించడానికి వాడారు (ఎఫెసీ 4:11-14; హెబ్రీ 13:20-21). "సంపూర్ణత" అనే పదానికి మూల భాషలో చాలా లోతైన అర్థం ఉంది. ఇది దేవుని ప్రజలను దేవుని పిలుపుకు, ఆయన చిత్తంలో ఉద్దేశించిన పనుల కోసం సన్నద్ధం చేయడం గూర్చి మాట్లాడుతుంది. సన్నద్ధం చేయడం అంటే చేతిలో ఉన్న పనిని నిర్వహించడానికి అవసరమైన అన్ని లక్షణాలను సమకూర్చడం, సరఫరా చేయడం. దేవుడు మనలను సిద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. కావున ఎక్విప్ అనే మాటకు అర్థము - ఒక నిర్దిష్టమైన పనికి లేదా పరిచర్యకు అవసరమైన వాటిని సమకూర్చుకోవడం, అలవర్చుకోవడం. అవసరమైనవి అంటే పరికరాలు కావచ్చు, ప్రవర్తన కావచ్చు, సామర్థ్యత కావచ్చు.

శిష్యరికపు సిద్ధపాటు నేపథ్యంలో యేసుప్రభువు సమూహాలతో మాట్లాడుతూ శిష్యరికానికి ఎలా సన్నద్ధమవ్వాలో రెండు ఉదాహరణలను లూకా 14:28-32లో చెబుతాడు. ఒక ఉదాహరణలో గోపురం కట్టేవాడు తనకు కావలసిన మెటీరియల్ సమకూర్చుకోవాలి, ఒకవేళ మధ్యలో ఆపేస్తే ఎంతో అవమానం. రెండవ ఉదాహరణలో యుద్ధానికి వెళ్ళేటప్పుడు సైనిక శక్తిని అంచనావేసుకొని సన్నద్ధం కావాలి. దీన్నిబట్టి విశ్వాసి తన పిలుపును, తనపట్ల దేవుని ఉద్దేశాన్ని నెరవేర్చడానికి తనను తాను సన్నద్ధం చేసుకోవడం, ఇతరులను సన్నద్ధం చేయడం ఎంతో అవసరం.

## ఎందుకు ఎక్విప్ అవ్వాలి?

**1. దేవుని చిత్తము:** చాలా సార్లు "నేను సిద్ధంగా లేను, నేను ఇంకా రెడీగా లేను, నేను ఎప్పటికీ అలా చేయలేను" అనేవారు కొంతమంది అయితే,

నేనే అన్నిటిలో 'టాప్' మరింక ఎక్విప్ అవ్వాల్సిన అవసరంలేదు అనుకొనే వారు మరికొంతమంది. కానీ దేవుని బిడ్డలముగా ప్రతి ఒక్కరం ప్రతి సత్కార్యానికి సంపూర్ణముగా సిద్ధపడి , సన్నద్ధులుగా ఉండాలనేది దేవుని ఉద్దేశం.

**2. దేవుని పిలుపు:** మత్తయి 11:28లో పాప భారం మోస్తున్న ప్రజలందరికి యేసుక్రీస్తు ఆహ్వానాన్ని ఇచ్చాడు. ఆ ఆహ్వానంలో రెండు భాగాలు ఉన్నాయి. మొదటిది విశ్రాంతినివ్వడానికి, రెండవది ఎక్విప్ అవుతూ కాడిని మోయడానికి. విద్యార్థుల పరిచర్యలో భాగస్వాములుగా ఉండేందుకు దేవుడు మనల్ని పిలిచాడు. ఆ పిలుపునకు తగినట్టుగా మనల్ని మనం ఎక్విప్ చేసుకోవాలి. ఒక తప్పుడు అభిప్రాయం ఏంటంటే దేవుడు పరిచర్యకు పిలిచాడు కదా, అంతా ఆయనే చూసుకొంటాడు. నన్ను నేను ఎక్విప్ చేసుకోవాల్సిన అవసరం లేదని చాలామంది అనుకొంటారు. ఈ విషయంలో బైబిల్ ఏం చెబుతుందంటే (1 పేతురు 1:1-7), మనలను పిలిచిన దేవుడు జీవనమునకును, భక్తికిని కావలసినవన్నియు దయచేసేవాడని (వ. 3) ఉంది. అయితే మనము మనవంతు పూర్ణ జాగ్రత్త గలవారమై (వ. 5) విశ్వాసానికి అమర్చుకోవాల్సినవి అమర్చుకోవాలి. అంటే మనం సోమరులం గాక పూర్ణజాగ్రత్తతో ఎవరికి వారు ఎక్విప్ చేసుకోవాలని లేఖనాలు బోధిస్తున్నాయి.

ఎక్విప్ చేసేవాళ్ళు ఉన్నప్పటికి ఎక్విప్ అవ్వడానికి క్రమశిక్షణ, సాత్వికం, దీనమనస్సు ఉండాలి. దానికి ఖచ్చితమైన సమయం, ప్రాధాన్యత ఉండాలి.

### ఎలా ఎక్విప్ అవ్వాలి?

ఎక్విప్ అవ్వడంలో ఎక్విప్ చేసేవారు, చేయబడేవారు కూడా దేవుని వాక్యం ప్రకారం, ఒక్కొక్కరి జీవితంలో దేవుని పిలుపు ప్రకారం ఎక్విప్ కావడం అంటే ఏంటో గ్రహించాలి. అందరినీ ఒకే మూసలో ఒకేరకంగా చేయకూడదు. విద్యార్థుల వ్యక్తిగత, సాధారణ సమస్యలు, పోరాటాలు, నమ్మకాలు, వాళ్ళు వ్యక్తిగతంగా, కుటుంబపరంగా, ఆధ్యాత్మికంగా ఎదుర్కొంటున్న సవాళ్ళను ముందు తెలుసుకోవాలి. వాటిమీద ఎక్విప్ చేసే మనం ఎక్విప్ అయి ఉండాలి. లేకపోతే ఎక్విప్పర్‌కి, నేర్చుకొనే వారికి సరైన వారధి ఏర్పడక అనేక అంతరాలు ఏర్పడతాయి.

### ఎక్విప్ చేసే క్రమంలో ఏర్పడే అంతరాలు

ఎ. **జనరేషన్ గ్యాప్:** విద్యార్థులను ఎక్విప్ చేసేటప్పుడు ప్రస్తుత తరాన్ని, వారి సవాళ్ళను, పోరాటాలను ఒత్తిళ్ళను అర్థం చేసుకోవాలి.

బి. **ఎక్విప్పర్ విశ్వసనీయత:** మనం ఎక్విప్ చేసే విషయాలలో మన జీవితం నమ్మదగినదిగా ఉన్నప్పుడు మన బోధకి విశ్వసనీయత ఉంటుంది.

సి. **కమ్యూనికేషన్ గ్యాప్:** వాళ్ళు ఏస్థాయిలో ఉన్నారో వాళ్ళదగ్గరనుంచి తెలుసుకొన్న తర్వాత వాళ్ళ ఆత్మీయ స్థాయికి తగినట్లుగా ఎక్విప్ చెయ్యాలి.

డి. **కాన్ఫిడెన్స్ గ్యాప్:** ఎక్విప్ చేసేవారికి, చేయబడేవారికి కూడ ఎక్విప్ చేయబడే బైబిల్ సత్యాల విషయాల్లో నమ్మకం ఉండాలి. క్షుణ్ణంగా ముందు అవగాహన చేసుకొంటే తప్ప ధైర్యంగా ఎక్విప్ చెయ్యలేము. ఉదాహరణకు నేను ధైర్యంగా ఇతరులను ఎక్విప్ చేయాలంటే నేను స్వంతంగా నోట్స్ తయారు చేసుకోవాలి. ప్రామాణిక పుస్తకాలు, సరైన బోధకుల దగ్గర, నేర్చుకోవాలి. ఎవరిదో నోట్స్ పిపిటి పట్టుకొని దాని నుంచి ఎక్విప్ చేస్తే ధైర్యం ఉండదు.

ఇ. **రిలవెన్సీ గ్యాప్:** మనం విద్యార్థులకు సందర్భానుసారంగా ఉండాలంటే వాళ్ళకు బోధించే బోధన పద్ధతి, ఎక్విప్ చేసే పద్ధతులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసికోకపోతే ఔట్‌డేట్ అయిపోతాము. ఉదాహరణకు ఇప్పటి విద్యార్థి లోకానికి నాణ్యమైన సంగీతం కావాలి. వాళ్ళతో కనెక్ట్ అవ్వాలి. ప్రాచీనకాలంలో రాసిన దేవుని వాక్యాన్ని ఆధునిక విద్యార్థులకు కాలానికి అనుగుణంగా చెప్పడానికి, కాలము చెల్లని దేవుని సత్యాల బోధనాంశాలలో రాజీపడకుండా ఎక్విప్ చేసే పద్ధతి, సమయపాలన, ఆకర్షణీయమైన వివరణని అనుసరించాలి.

బైబిల్ రచయితలు యూదులతో మాట్లాడే సందర్భంలోనూ, అన్యజనులతో మాట్లాడే సందర్భంలోనూ పరిస్థితులకు అనుగుణంగా మాట్లాడారు. వాళ్ళ బ్యాక్‌గ్రౌండ్ తెలుసుకొని వాళ్ళను ఎక్విప్ చేశారు. ఉదాహరణకు పౌలు తిమోతిని, తీతును, ఫిలేమోనును పరిస్థితులకు అనుగుణంగా ఎక్విప్ చేశాడు.

అయితే ముఖ్యమైన విషయమేటంటే ఎక్విప్

చేయడం, ఎక్విప్ చేయబడడం అనేది ఉద్దేశపూర్వకంగా ప్రణాళికా పూర్వకంగా, ప్రేమపూర్వకంగా జరగాలే గాని అప్రయత్నంగా జరగదు.

## ఎక్విప్ అవ్వడం

**దేవుడు ఎక్విప్ చేస్తాడు:** దేవుడు తన పరలోకపు వనరులను మనలను ఎక్విప్ చేయడానికి అనుగ్రహిస్తాడు. మనలను తనకు విధేయులైన, నమ్మకమైన, సామర్థ్యముగల సేవకులుగా తీర్చి దిద్దే పనిని చేపట్టడానికి దేవుడే సిద్ధంగా ఉన్నాడు అనేది ఎంతటి ఆనందం, ఆసక్తి, ఆశకు ఆధారం (హెబ్రీ13: 21).

**దేవుని సాధనం:** ఎక్విప్ చేయడానికి దేవుడు అందించిన ప్రాథమిక, ప్రాముఖ్యమైన సాధనం దేవుని వాక్యం. వాక్య జ్ఞానం లేకుండా పరిపక్వత లేదు, వివేచన లేదు (హెబ్రీ 5:14 ), స్వచ్ఛమైన బోధ లేదు, పెరుగుదల లేదు (1 పేతురు 2:2). నేర్పించే మనము ముందుగా వాక్య జ్ఞానంలో పట్టు సాధించి, పాటించి ఆపై నేర్పించాలి. వారికి తినడానికి "చేపలు" మాత్రమే ఇచ్చేవారంగా గాక ఎక్కడైనా తమకు తాముగా "చేపలు" పట్టుకొనే వీలు కల్పించే సాధనాలతో ఎక్విప్ చేద్దాం.

**మన పాత్ర:** దేవుడు మనలను ఎక్విప్ చేసే పని ఆటోమేటిక్‌గా అయిపోతుందా? అస్సలు కాదు! మనము నిమిత్తమాత్రులం కాదు. మనం బాధ్యులం. క్రమశిక్షణతో కూడిన మన సాధన, ప్రయాసలను దేవుడు దీవిస్తాడు. కాబట్టి, మనం ప్రతిరోజు వాక్యంలో, ప్రార్థనలో దేవుని సత్యాలను వెతకాలి. వినయంగా ఆయనపై ఆధారపడాలి. మనం మనవైపు, లేదా ఇతరుల తప్పుల వైపు చూడకూడదు. అలా చేస్తే మన జీవితాలలో ఆత్మ యొక్క పనిని మనం నిరోధించి (అపొ. కార్య. 7:51), చల్లార్చి (1 థెస్సలొ. 5:19), దు:ఖపెడతామని (ఎఫెసీ. 4:30) తెలుసుకొని ఎంతో జాగ్రత్తతో దేవునిని ఆశ్రయించాలి. సాధన మన వంతు. పని సామర్థ్యం దేవుని కృప. అతిశయానికి తావు లేదు.

## జీవితకాల ప్రక్రియ

ఎక్విప్ అవ్వడం ఒక కార్యక్రమం మాత్రమే కాదు గాని ఇది జీవితకాల ప్రక్రియ. నేను ఎక్విప్ చేసే స్థాయికి వచ్చాను కాబట్టి నేను ఎవరి దగ్గర నేర్చుకోవాల్సిన అవసరం లేదు అనడానికి లేదు. నన్ను నేను ఎక్విప్ చేసికోగలను. నాకు ఎవరు నేర్పించనవసరం లేదు అనడానికి లేదు. దీనికి నిరంతర కృషి, కావాలి.

## దేవుని ఏర్పాటు - మన దృక్పథం

దేవుడు మనకు ముగ్గురు టీచర్స్‌ను ఇచ్చాడు. పరిశుద్ధాత్ముడు, ప్రభావవంతులైన బైబిల్ టీచర్స్, క్రమశిక్షణతో కూడిన మన సొంత అధ్యయనం. సాత్వికంతో దేవుడిచ్చిన వనరుల్ని వినియోగించుకొంటూ ఎక్విప్ చేయ్యాలి, చేయబడాలి.

## నా అనుభవం

మొదటిగా, నా జీవితంలో ప్రభువుని ఎరిగిన దగ్గర నుంచి ఒక్కొక్క దశలో ఒక్కొక్కరు అనగా స్టాఫ్, సీనియర్ గ్రాడ్యుయేట్స్, కో బిలీవర్స్, నా భార్య, పిల్లలు, ఎందరో దైవజనులు, వారి బోధలు ప్రత్యక్షంగా, పరోక్షంగా నా ప్రయాణంలో అనేక రకాలుగా నన్ను, నా పరిచర్యను ఎక్విప్ చేసుకోవడానికి సహాయం చేశారు.

రెండవదిగా, దీనికి మించి నేను వ్యక్తిగతంగా వాక్యాన్ని స్టడీ చేస్తున్నాను. 66 పుస్తకాలలో ఒక్కొక్క దానిమీద పట్టుసాధిస్తూ, నా స్వంత నోట్స్ తయారు చేసుకొని సిద్ధపడుతూ దాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ ఉండటం ద్వారా ఎక్విప్ అవుతున్నాను. వాక్య పరిచర్యకు దేవుడిచ్చే ప్రతి అవకాశము చిన్నదైనా పెద్దదైనా శ్రద్ధగా దేవుని అనుగ్రహంగా తీసుకొని సిద్ధపడి సామర్థ్యం కోసం దేవునివైపు చూస్తాను. దేవుని కృపా అనుగ్రహమును బట్టి దేవునికే మహిమ.

మూడవదిగా పరిశుద్ధాత్ముడు, ప్రార్థన ద్వారా నన్ను ఎక్విప్ చేస్తూ వస్తున్నాడు.

## ముగింపు

ఎక్విప్ చేయడం, చేయబడడం దేవుని కృప. ఆత్మ సహాయం ద్వారా ఈ ప్రక్రియ కొనసాగాలి. మన ఉద్యమం గూర్చి అధ్యయనం చెప్పే వాస్తవాలు చూస్తే ఇంకా మనం తగినంతగా ఎక్విప్ అవ్వాల్సిన అవసరం చాలా ఉందని తెలుస్తుంది. ఈ విషయంలో శ్రద్ధ చూపించకపోతే మనం నిరుపయోగంగా ఉండే సభ్యులుగా నేర్చుకొన్న మూలపాఠాలతో తృప్తిపడే సభ్యులు పెరిగిపోయే ప్రమాదం ఉంది. కావున మనమందరం నేర్చుకొంటూ నేర్పిస్తూ, దేవుని ఎదుట, సిగ్గుపడనక్కరలేని వానిగా దేవుని మహిమార్థం, అందరి క్షేమార్థం అన్ని విషయాలలో ఎక్విప్ అవుదాం.

**– బి. రంగనాథమ్,** వైజాగ్

అవగాహన



# విద్యార్థులే మన విజన్, మిషన్

సాయంకాలమైంది. అమ్మ, నాన్న ఇంట్లో ఉన్నారు. రాత్రి భోజనం చేసిన తర్వాత జిమ్మీ ఆడుకొంటున్నాడు. అమ్మ గడియారం వైపు చూసి “జిమ్మీ, పడుకొనే సమయమైంది. పైకి వెళ్ళు, నేను తర్వాత వస్తాను” అని చెప్పింది. సుమారు ఒక గంట తర్వాత అతని తల్లి జిమ్మీ నిద్రపోతున్నాడా లేదా అని చూడడానికి వచ్చింది. జిమ్మీ నిద్రపోకుండా కిటికీలోనుంచి వెన్నెల దృశ్యాన్ని నిశ్శబ్దంగా, తదేకంగా చూస్తున్నాడు. ‘జిమ్మీ, ఏంచేస్తున్నావ్?’ అని అడిగింది. ‘నేను చంద్రుని వైపు చూస్తున్నాను మమ్మీ’ అన్నాడు. ‘సరే, రా పడుకొనే సమయమైంది’ అని మమ్మీ పిలవగానే జిమ్మీ అయిష్టంగా వస్తూ, ‘మమ్మీ, ఒకరోజు నేను చంద్రునిపై నడుస్తాను’ అన్నాడు. ఆ మాటలు మమ్మీకి ఏమీ అర్థంకాలేదు. ఆ రాత్రి నిద్రపోయినా, తర్వాత తన జీవితంలో తన కలను సాకారం చేసుకొనేంతవరకు నిద్రపట్టకుండా చేసింది. బైక్ యాక్సిడెంట్‌లో తన శరీరంలోని దాదాపు ప్రతి ఎముక విరిగి ప్రాణాంతకమైన పరిస్థితులు ఎదుర్కొన్నా తన కలను మర్చిపోలేదు. 1971 జూలై 26న అపొల్లో 15 అనే వాహనం ద్వారా ప్రయాణించి 13 రోజుల తర్వాత చంద్రుని మీదకు కాలుమోపి తన కలను సాకారం చేసుకున్నాడు. ఆయనే అమెరికా అంతరిక్ష పరిశోధకుడు జేమ్స్ ఇర్విన్.

### దర్శనం అంటే?

ఒక వ్యక్తి, సంస్థ చుట్టూ ఉన్న ప్రపంచం భవిష్యత్‌లో ఎలా ఉండాలో లేదా ఏం సాధించాలో అని మనసులో ఉండే ఊహా చిత్రాన్నే దర్శనంగా/కలగా నిర్వచించవచ్చు. దేవోక్తి (దర్శనం) ప్రతి విశ్వాసికి తన విశ్వాస యాత్రలో చుక్కానిలాంటిది. చుక్కానిలేని నావ సముద్రంలో ఒక నిర్దిష్టమైన దిశ లేక గాలి ఎటు వీస్తే అటు ప్రయాణిస్తుంది, నావికుని ఆధీనంలో ఉండదు. అలాగే ప్రతి విశ్వాసికి, పరిచర్యకు ఖచ్చితమైన దర్శనం అవసరం.

### యుఇయస్ఐకి దేవుడిచ్చిన దర్శనం

“మార్పు చెందిన విద్యార్థులు ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులుగా కళాశాల ప్రాంగణాలను, దేశాన్ని ప్రభావితం చేయడం”. ఇది దేవుడు మనకిచ్చిన దర్శనం/కల. ఈ దర్శనం నెరవేర్పు కొరకు ప్రతి విద్యార్థి, గ్రాడ్యుయేట్, స్టాఫ్ ఎంతో కృషిచేయాలి. ఈ దర్శనాన్ని విపులంగా అర్థం చేసుకొంటే దీనిలో మూడు విషయాలు ఉంటాయి.

### మార్పు చెందిన విద్యార్థులు

సువార్త సత్యాలు విద్యార్థుల హృదయాలను తాకినప్పుడు, వారి అంతరంగం, మాటలు, ఆలోచనలు, అలవాట్లు, పనులు, సంబంధాలు, ప్రవర్తన మార్పుకు గురై నీతి వైపుకు మరలడం చూస్తాము.

### యేసుప్రభువు శిష్యులుగా ఉండడం

విశ్వాస విద్యార్థులు తమ జీవితం మీద అన్ని విషయాలలో దేవుని చిత్తానికి విధేయత చూపిస్తూ,

శిష్యునిగా ఉండడంలో ఉండే సవాళ్ళను ఎదుర్కొంటూ, కష్టమైనా, నష్టమైనా, బాధైనా నిజమైన యేసుక్రీస్తు శిష్యులుగా ఉంటారు. చిన్న చిన్న గ్రూప్ బైబిల్ స్టడీస్, రిట్రీట్స్, క్యాంప్స్, మెంటరింగ్, కౌన్సిలింగ్, కాన్ఫరెన్స్‌లు... విద్యార్థుల జీవితాలలో బలమైన మార్పును తీసుకొని వస్తాయని అనడంలో ఎలాంటి సందేహం లేదు. 12 మంది శిష్యులను భూమిని తల క్రిందులుగా చేసే వారిగా పిలిచారు.

### కళాశాల ప్రాంగణాలను, దేశాన్ని ప్రభావితం చేయడం

విశ్వవిద్యాలయాలు విజ్ఞానకేంద్రాలు. విశ్వంలో ఉన్న అనేకమైన వాటిని గూర్చి అధ్యయనం చేసే క్షేత్రాలు. సృష్టిని అర్థం చేసుకొని సృజనాత్మకతను బోధించి మానవ కళ్యాణానికి ఉపయోగపడే సరి కొత్త వస్తువులు సృష్టించే కర్మాగారం. ఇటువంటి ప్రదేశాలు అశ్లీలత, ర్యాగింగ్, డ్రగ్స్, అనైతిక పనులు, ఆత్మహత్యలు, అబద్ధాలు మొదలైన వాటికి కేంద్రాలుగా మారిపోతున్నాయి. దేశంలో ఎక్కడ చూసినా ఇలాంటి పరిస్థితులే కనిపిస్తాయి. అందుకే యేసుక్రీస్తు శిష్యులను ఉద్దేశించి మత్తయి 5:13–15లో "మీరు లోకానికి ఉప్పుయియున్నారు. మీరు లోకమునకు వెలుగైయున్నారు. మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" అని చెప్పాడు. ఒక విశ్వాస విద్యార్థి జీవితం దీపం లాంటిది, తన యొక్క మాటలు, ప్రవర్తన, ఆలోచనలు, అలవాట్లు, సంబంధాలు ద్వారా ప్రభువును మహిమపరుస్తూ అనేకమంది అవిశ్వాస విద్యార్థులను అధ్యాపకులను దేవునియందు విశ్వాసముంచేటట్లు వారిని ప్రభావితం చేయవచ్చు. అలాగే సమాజంలో క్రైస్తవ ఉపాధ్యాయుడిగా, క్రైస్తవ నాయకుడిగా, క్రైస్తవ అధికారిగా, శాస్త్రవేత్తగా ఉన్నవారు అనేక విధాలుగా క్రైస్తవ విలువలను సమాజంలో నాటుతూ దేశాన్ని ప్రభావితం చేయాలి.

ఇన్‌స్టిట్యూట్ ఫర్ అడ్వాన్స్ స్టడీ ఎట్ ప్రిన్సిటన్ యూనివర్శిటీలో సోషియాలజిస్ట్‌గా పనిచేసిన అమెరికా దేశస్తుడు రాబర్ట్ బ్లేయిర్ ఇలా అన్నాడు "అహింస, న్యాయంతో కూడిన ప్రపంచం కోసం దర్శనం కలిగిన ఒక చిన్న గుంపు యొక్క ప్రాముఖ్యతను మనం ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదు. ఒక సమాజంలో 2% ప్రజలు ఒక కొత్త దర్శనాన్ని కలిగి ఉంటే ఆ సమాజమే వారి మూలంగా మారి పోతుంది". అందుకే 'దేవోక్తి లేనియెడల జనులు కట్టులేక తిరుగుదురని' (సామె 29:18) దేవుని వాక్యం చెబుతుంది.. 'ఈ ప్రపంచంలో దయనీయమైన వ్యక్తి చూపులేని వాడు కాదు, ఏ దర్శనం లేనివాడు' అని హెలెన్ కెల్లెర్ చెబుతుంది.

### మిషన్

దర్శనాన్ని నెరవేర్చడానికి ఏమి చేయాలో తెలియజేసేది మిషన్. ఎప్పుడు, ఎవరికి ఏమి చేయాలో నిర్దేశిస్తుంది, మన చేతులకు, కాళ్లకు, మేధస్సుకు, హృదయానికి పనిని కల్పిస్తుంది. జోయల్ బేకర్ ఇలా అన్నాడు "ఏ పని చేయకుండా ఉండే దర్శనం పగటి కలలాంటిది, దర్శనం లేకుండా చేసే పని వృధా కాలక్షేపం, దర్శనంతో చేసే పనే ప్రపంచాన్ని మారుస్తుంది".

### యుఇయస్ఐ మిషన్

"భారతీయ కళాశాల విద్యార్థులను క్రీస్తు సువార్తతో సంధించి వారు సంఘానికి, సమాజానికి సేవ చేసే యేసుక్రీస్తు ప్రభువు శిష్యులుగా తర్ఫీదు చేయడం". దీనిలోని విషయాలను గమనిద్దాం.

### భారతీయ కళాశాల విద్యార్థులను సౌవార్తీకరించడం

ఇంటర్మీడియట్ విద్యార్థుల నుంచి మొదల వుతుంది. కళాశాలలో చేరి, వెళ్ళిపోయే లోపు ఒక్కసారైనా సువార్త వినాలనే సంకల్పంతో పనిచేయాలి. విద్యార్థులను ఎప్పటికప్పుడు అర్థం చేసుకొంటూ వారికి తగినరీతిలో సృజనాత్మకమైన పద్ధతులలో సువార్తను అందించాలి. పౌలు మాటలు మనకు ఎంతో ప్రోత్సాహకరం. "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను, ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగుజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" (రోమా 1:16). సువార్త విద్యార్థుల జీవితాలలో నిజమైన మారుమనసును తీసుకొస్తుంది. ఇబియస్, పర్సనల్ ఇవాంజలిజం, గాస్పల్ రిట్రీట్స్, ఇవాంజలిస్టిక్ క్యాంప్స్, ట్రాక్ట్స్ మొదలైనవాటి ద్వారా, సోషల్ మీడియాను కూడా ఉపయోగించుకొని ప్రభావవంతంగా సువార్తను ఎలా ప్రకటించవచ్చో వివిధ రకాల పద్ధతులను అన్వేషించాలి.

### ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులుగా తర్ఫీదు చేయడం

మారుమనసు పొందిన విద్యార్థులను యేసుక్రీస్తు శిష్యులుగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ,

శిష్యత్వాన్ని గూర్చిన విషయాలన్నిటిని బోధించాలి. శిష్యరికం చేయడంలో ఉన్న సవాళ్ళు, ఆధిక్యత లను తెలియజేసి వారిని శిష్యులుగా ఉండేటట్లు ప్రోత్సహించాలి. ఇది బిబియస్, క్యాంప్స్, వ్యక్తిగత శ్రద్ధ ద్వారా విశ్వాసులతో మంచి సంబంధాలను ఏర్పరచుకొని వారికి మౌనధ్యాన సమయం, ప్రార్థనా జీవితం, విశ్వాసం, పవిత్రత, సాధారణ జీవనశైలి, యధార్థత మొదలైన విషయాల్లో శిక్షణ ఇవ్వాలి.

**సంఘానికి, సమాజానికి సేవ చేసే విధంగా తయారుచేయాలి**

యేసుక్రీస్తు శిష్యునిగా ఉన్న విద్యార్థి మంచిగా చదువులో రాణించేవాడుగా, కళాశాలలో ఉన్న చెడు సంస్కృతి ర్యాగింగ్, కాపీ కొట్టడం, లంచాలు ఇవ్వడం మొదలైనవాటికి వ్యతిరేకంగా తన వాయిస్‌ను తెలియజేస్తూ, లవ్ అఫైర్స్, డ్రగ్ అడిక్షన్, మొబైల్ అడిక్షన్‌లో చిక్కుకొన్న వారికి పరిష్కార మార్గాల ను చూపించాలి. తమ తోటి విద్యార్థులకు ప్రేమ, దయ, మంచి సహవాసం, ఆత్మీయతను పంచుతూ ఒక మంచి క్రైస్తవ నాయక విద్యార్థిగా ఎదిగేటట్లు చేయాలి. సమాజంలో ఒక క్రైస్తవుడుగా, సంఘంలో ఒక బాధ్యతాయుతమైన సభ్యునిగా క్రైస్తవ విలు వలను పెంచేవాడివిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే కళాశాల ప్రాంగణాలలో మార్పును చూడగలము. ఈ మార్పు గృహాలను, సంఘాలను, ఇరుగు పొరుగు వారిని, తన ఊరిని చివరకు దేశాన్ని మార్చేదిగా ఉంటుంది.

**విజన్, మిషన్‌ను ఎందుకు తెలుసుకోవాలి?**

**గురిని అర్థం చేసుకోవడానికి:** విజన్,మిషన్-వ్యక్తులకు, సంస్థలకు, చుట్టు ఉన్న ప్రపంచానికి ఒక గురిని, ఉద్దేశాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చి ఏమి చేయాలో, ఏమి చేయకూడదనే విషయాలను విశదపరుస్తుంది. పౌలు గారి మాటలలో నేను గురి యొద్దకే పరుగెత్తుచున్నాను. (ఫిలిప్పీ 3:4) అంటాడు.

**దేవుని చిత్తము:** దేవుడు ఏమి ఆశిస్తున్నాడో తెలుసుకొని వాటి ప్రకారం జీవించడానికి

**సరైన రీతిలో ఖర్చు పెట్టడం:** దేవుడు ఇచ్చిన సమయం, వరాలు, ధనం ఎలా ఖర్చు పెట్టాలో తెలుస్తుంది.

**ప్రణాళిక:** వ్యక్తిగతముగా, పరిచర్య పరంగా ఏవిధంగా ప్రణాళిక కలిగియుండాలో ఎటువంటి ఫలితాలు సాధించామో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.

**కష్టపడేవారిగా:** సమయం వ్యర్థం కాకుండా పనిచేసే వారిగా, అవసరం లేని పనులను చేయకుండా సహాయం చేస్తుంది.

**ప్రోత్సాహం:** క్లిష్టమైన పరిస్థితుల్లో సహితం ఆశను, నిరీక్షణను, శక్తినిస్తుంది.

**విధేయత:** స్వంత చిత్తాలను, ఇష్టాలను వదిలిపెట్టి దేవుని ఇష్టానికి లోబడేవిధంగా సహాయపడుతుంది.

**జీవనశైలి:** విజన్, మిషన్ ఆధారంగా జీవనశైలి ఏవిధంగా ఉండాలో తెలియజేస్తుంది.

**ఐక్యత:** కలిసి పనిచేయడానికి సహాయపడుతుంది.

**దేవునిపై ఆధారపడడం:** మనకు ఇచ్చిన బాధ్యతల ను నెరవేర్చడంలో మన శక్తి మాత్రమే చాలదనీ గ్రహించి దేవునిపై, దేవుని శక్తిపై ఆధారపడే వ్యక్తులు గా చేస్తుంది. అర్థవంతమైన, ప్రార్థనా జీవితం అలవాటు అవుతుంది.

**తర్వాత తరాన్ని తయారు చేయడం:** తన తర్వాత తరాలకు దర్శనం అందించడానికి నమ్మకమైన వారిని తయారు చేయడంలో ఎంతో సహాయపడుతుంది.

**పరిపక్వత:** వివిధ రకాల దర్శనాలు ఉన్నా అన్నిటిలోనూ దేవుని నుంచి కలిగిన వాటిని అర్థం చేసుకొని వారితో మంచి సంబంధాలు కలిగి ఉండడానికి.

అందుకే పౌలు – మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని. విశ్వాసము కాపాడుకొంటిని, ఇకమీద నా కొరకు నీతి కిరీటము ఉంచబడియున్నది. 2 తిమోతి 4:7,8. అని అంటాడు.

**విజన్, మిషన్ ఎలా తెలియజేయాలి?**

**నూతనంగా పరిచయమైన విశ్వాస విద్యార్థులకు/ గ్రాడ్యుయేట్స్‌కు**

- దేవునితో వారు చక్కని సంబంధం కలిగి ఉండేటట్లు ప్రోత్సహిస్తూ వారికి దేవుడు పరిచర్య పట్ల ఎటువంటి భారం ఇస్తున్నాడో గుర్తించేటట్లు సహాయపడాలి.
- వ్యక్తిగత పరిచయం 1:3 యంపిసి ద్వారా విజన్ మరియు మిషన్ అర్థం చేసుకొనేటట్లు చేయవచ్చు.

- విద్యార్థి పరిచర్యలో జరుగుచున్న వివిధ కార్యక్రమాలకు క్రమంగా హాజరయ్యేటట్లు ప్రోత్సహించాలి.
- వివిధ కార్యక్రమాల్లో (బిబియస్, వన్‌డే రిట్రీట్స్, క్యాంప్స్, కాన్ఫరెన్స్) విజన్, మిషన్‌ని తెలియజేయాలి.
- వారియందు ఉన్న సామర్థ్యము, తలాంతులను గుర్తించి నాయకత్వ బాధ్యతలను అప్పగించి ప్రోత్సహించాలి.
- విద్యార్థి పరిచర్య యొక్క ప్రాముఖ్యతను తరచుగా వారితో చర్చించాలి.
- డిస్ట్రిక్ట్, రీజినల్, స్టేట్, నేషనల్ లెవల్ ప్రోగ్రామ్స్‌కి హాజరయ్యేటట్లు ప్రోత్సహించడం. అవుట్‌రీచ్ ప్లేస్‌లో ప్రేయర్ వాక్స్ చేసేటట్లు, ప్రొ. ఇనాక్, స్టెరెట్, జోసఫ్ అభిషేక రావు గార్ల బయోగ్రఫీలు, విద్యార్థి జ్వాల చదివేటట్లు ప్రోత్సహించాలి.

**స్థానిక సంఘానికి**

- సంఘంలోని విశ్వాసులు కూడా దేవుడు వారికి ఇచ్చిన పరిచర్య భారాన్ని అర్థం చేసుకొనే విధంగా ప్రోత్సహించడం.
- స్థానిక సంఘాల్లో ఇయు సండేస్ నిర్వహిస్తూ, అవసరమైన ప్రతి సందర్భంలో విద్యార్థి పరిచర్య యొక్క ప్రాముఖ్యతను తెలియజేయాలి.
- మెటీరియల్స్, వీడియోస్ ద్వారా సృజనాత్మకంగా విజన్, మిషన్ స్టేట్‌మెంట్‌ని తెలియజేయవచ్చు.
- విద్యార్థి పరిచర్యలో జరిగే కార్యక్రమాల జాబితాను సంఘ సభ్యులకు తెలియజేసి వారి యొక్క ప్రార్థనా సహాయాన్ని కోరాలి.
- వీలైనప్పుడు సంఘంలోని సభ్యులను, సంఘ కాపరిని కొన్ని కార్యక్రమాలకు ఆహ్వానించవచ్చు.
- సంఘ సభ్యులకు ఇయు క్యాలెండర్‌లను పంచిపెట్టడం ద్వారా, విద్యార్థి జ్వాల, ఇతర పుస్తకాలను పరిచయం చేసి వారు చదివేటట్లు ప్రోత్సహించాలి.
- మంచి మాదిరి, సాక్ష్యజీవితం కలిగిఉండడాన్ని బట్టి అనేకమంది సరిగా అర్థం చేసుకొంటారు.



**సమాజానికి**

- క్రైస్తవ విలువలను కలిగి జీవించడం వలన చుట్టూ ఉన్న అవిశ్వాసుల సమూహములను ప్రభావితం చేయవచ్చు.
- నైతిక విలువలు, దృక్పథాలు కలిగి ఉండేవారిగా వారితో మంచి సంబంధాలను కలిగి వారికి బోధించవచ్చు.
- విద్యార్థుల సమస్యలు, ఒంటరితనం, డిప్రెషన్, భయం..మొదలైనవాటిపై దైవిక సంబంధమైన సూచనలు చేయవచ్చు.
- విద్యార్థి సంబంధమైన సమస్యలు/అంశాలకు ఆర్టికల్స్ రాయవచ్చు.
- సమాజం విద్యార్థి సమస్యలు/ విద్యా వ్యవస్థల పరిస్థితులకు సరియైన సూచనలు, సలహాలు ఇచ్చే విధంగా ప్రోత్సహించవచ్చు.
- సామాజిక రుగ్మతల నుంచి భయపడడానికి అనేకమైన సూచనలు, సలహాలు, అవసరమైనప్పుడు పోరాటాలు చేసేవారిగా ఉండాలి.
- మంచిగా అర్థం చేసుకొనే వారికి, విద్యార్థుల జీవితాలను సువార్త ఎలా మారుస్తుందో తెలియజేసి అనేకమంది విద్యార్థుల జీవితాలను మాదిరిగా వారికి చూపించవచ్చు.
- విద్యా వ్యవస్థ స్థితిగతుల మీద పరిశోధనలు, సర్వేలు చేయవచ్చు.

ఎక్కడైతే మన ఉనికి కలిగియున్నామో అక్కడ దైవిక సంబంధ లక్షణాలను నాటి, పెంచి, పోషించి అనేకమైన వ్యక్తులు ప్రభావితం అయ్యేటట్లు చేస్తే, తమ యొక్క జీవనశైలి ద్వారా విద్యార్థి పరిచర్య దర్శనం, మిషన్ (పని) నెరవేర్చినవారం అవుతాము.

– **పి. కన్నయ్య,** యుఇయస్‌ఐ–ఏపి స్టాఫ్,
విజయనగరం

కథానిక



# పట్టించుకునేవాళ్ళున్నారు

"చర్చికి టైమ్ అవుతోంది. తొందరగా తయారవ్వు" అంది సుస్మిత వంటింట్లోనుంచి. తల్లి మాటలు వినీ విననట్లుగా మాట్లాడకుండా ఊరుకొన్నాడు. "చెప్పేది నీకే" స్వరం పెంచింది సుస్మిత. తప్పదన్నట్లు పైకి లేచి తల్లి దగ్గరకెళ్ళి "చర్చికి నేనొచ్చినా ఒక్కటే, రాకపోయినా ఒక్కటే. వందనాలు చెప్పే సమయంలో తప్ప నేనొచ్చి ఉపయోగమేముందమ్మా" అన్నాడు. కొడుకువంక మురిపెంగా చూసిన సుస్మిత 'దేవుడు మనకన్నీ ఇచ్చాడు. మనల్ని ప్రాణాలతో ఉంచాడు. దేవుడి కోసం ఏమీ చేయకపోయినా కనీసం చర్చికి వెళ్ళైనా మన కృతజ్ఞత చూపించాలి కదరా" అంది సుస్మిత. "కృతజ్ఞత చూపించడానికి వారం వారం చర్చికి వెళ్తేనే సరిపోతుందా?" అన్నాడు యథాలాపంగా. కొడుకువంక విస్మయంగానూ, అయోమయంగానూ చూసింది సుస్మిత. తెలియక అడిగినా, తెలిసి అడిగినా కొడుకు ప్రశ్నలోని లోతు ఆమె దృష్టిని దాటిపోలేదు. అలాగని సమాధానం చెప్పే బైబిల్ లోతులు కూడా ఆమెకు తెలియదు. ప్రతీవారం క్రమం తప్పకుండా భర్తనీ, కొడుకునీ వెంటబెట్టుకుని చర్చికి వెళ్లడంలోనే ఆమెకు ఎంతో సంతృప్తి!

తల్లి మౌనంగా ఉండడం చూసిన సునీల్ ఆమెను సమీపించి "అయ్యో నేను మామూలుగా అడిగానమ్మా. మీరు బాధపడతారని రావడం, ఒక్కడినే ఏమీ తోచనట్లు కూర్చోవడం నాకు ఇబ్బందిగా ఉంది. అక్కడ నన్నెవరూ పట్టించుకోరు. ఎవరిదారి వారిదిలా ఉంటుంది. ఎంతసేపూ దేవునికి ఇవ్వాలి, దేవునికిస్తే నీకు దీవెన... ఇవే మాటలు" అన్నాడు. కొడుకు మాటలకు పెద్దగా నవ్వింది సుస్మిత. కాసేపయ్యాక "మనకొచ్చిన దానిలో దశమభాగం ఇవ్వడం తప్పు కాదుగా. అలా చేయకపోతే సంఘాలు ఎలా నడుస్తాయి" అంది. "అందుకని... అస్తమానం ఇవ్వమని చెప్పడం తప్ప బైబిల్లో ఇంకేమీ లేవా?" అన్నాడు సునీల్.

మాటల్ని పొడిగిస్తే ఇంకెన్ని ప్రశ్నల్ని వినాల్సి వస్తుందోనని భయపడిన సుస్మిత కొడుకు వంక చూస్తూ "ఇప్పటికే చాలా టైమ్ అయిపోయింది. నువ్వడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్తూ కూర్చుంటే మిగిలిన టైమ్ కూడా ఇక్కడే అయిపోయేటట్లుంది. తొందరగా తయారవ్వు" చెప్పి ముందుకు కదిలింది.

***

చర్చి ముందాగిన ఆటోలో నుంచి దిగి లోపలికి నడిచాడు సునీల్. వందనాలు చెప్తున్న వాళ్లందరికీ ప్రతిగా నవ్వుతూ వందనాలు చెప్పి లోపలికి ప్రవేశించి ఒక కుర్చీలో కూర్చున్నాడు. చిన్నపిల్లలు హడావిడిగా అటూ ఇటూ పరుగులు పెడ్తున్నారు.

ప్రారంభ ప్రార్థన అయ్యాక కోరస్ మొదలైంది. తెలిసిన వాళ్ళంతా ఎవరికి తోచినట్లుగా వాళ్ళు పాటలు పాడుతూ దేవునిని మహిమ పరుస్తున్నారు. చివరిపాట పాడేటప్పుడు పాస్టర్‌గారు లోపలికి వచ్చి స్టేజ్‌మీద ఆయనకు కేటాయించిన కుర్చీలో కూర్చున్నాడు.

కాసేపయ్యాక పాస్టర్‌గారు సందేశం మొదలు పెడ్తూ "ఈరోజు మనం దేవునికి ఇవ్వడం ద్వారా

పొందుకొనే ఆశీర్వాదాల గురించి బైబిల్ ఏమి చెప్తుందో చూద్దాం.ముందుగా మలాకీ గ్రంథంలోని 3:10 వచనాన్ని ఎవరైనా ఒకరు బిగ్గరగా చదవండి" అనగానే "నా మందిరములో ఆహారముండునట్లు పదియవభాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసికొని రండి. దీని చేసి మీరు నన్ను శోధించిన ఎడల నేను ఆకాశపు వాకిండ్లను విప్పి పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించెదనని సైన్యములకు అధిపతియైన యెహోవా సెల విచ్చుచున్నాడు'' అని చదివి వినిపించారు. తర్వాత 2వ కొరింథీలోని 9:7 వచనంలో ఉన్న వాక్యాన్ని చదవమనగానే "సణుగుకొనకుండా, బల వంతముగా కాక ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను. దేవుడు ఉత్సాహముగా ఇచ్చువారిని ప్రేమించును" అనే వాక్యాన్ని పెద్దగా చదివి వినిపించారు.

వాక్యం గురించి ప్రార్థించిన తర్వాత అయ్యగారు ఉపన్యాసం మొదలుపెట్టారు. ఆయన ఉపన్యాసం ఇవ్వడంలోని ఆశీర్వాదాన్ని, ఇవ్వకపోవడంలోని నష్టాల్ని గురించి ప్రవాహంలా సాగిపోతోంది. ముందువరుసలో కూర్చున్న సుస్మిత మెడ తిప్పి వెనుక కూర్చున్న కొడుకు వైపు చూసింది. సునీల్ తల్లివంక చూశాడు. ఆ చూపులు 'నేను ముందే చెప్పాను'గా అన్నట్లు ఉన్నాయి. నవ్వుకొంటూ సుస్మిత వాక్యం వినడంలో లీనమైపోయింది.

పదినిమిషాల తర్వాత చుట్టూ చూశాడు సునీల్. అరవైలు దాటినవాళ్లంతా కాళ్ళు బార్లా చాపుకొని కూర్చున్నారు. నలభైలు దాటినవాళ్ళు రాత్రి మిగిలిపోయిన 'చద్ది నిద్ర'ను వదల్లేక కూర్చునే కునికిపాట్లు పడుతున్నారు. ఇరవైల్లో ఉన్నవాళ్లంతా 'అరచేతిలో చరవాణి సందేశాల్ని' చూస్తూ మైమరచిపోతున్నారు. ఉధృతంగా, ప్రవాహంలా సాగి పోతున్న పాస్టర్‌గారి వాక్యసందేశం కంటే లోకాన్ని వదల్లేక పడుతున్న అవస్థలే సునీల్ కళ్ళముందు ప్రత్యక్షంగా కనిపించసాగాయి.

మనసు భారంగానూ, బాధగానూ మారిపోయింది. కుర్చీలోనుంచి లేచివచ్చి గేటు దగ్గరనుంచి బయటకు చూస్తున్న సునీల్ "వాక్యం వినకుండా ఇక్కడున్నావేంటి తమ్ముడూ" అన్న మాట వినిపించి వెనక్కి తిరిగాడు. తనవంక నవ్వుతూ చూస్తున్న విజయ్ కనిపించాడు. "వందనాలు అంకుల్" అన్నాడు.

"అంకుల్ కాదు... అన్నా అని పిలువు" అన్నాడు విజయ్.

"అలాగే అన్నా" అని నవ్వాడు సునీల్.

"ఏంటిక్కడ నుంచున్నావ్?" అడిగాడు విజయ్.

''లోపల వాక్యం చెప్తున్నారుగా అన్నా... అందుకే"

"అదే అడుగుతున్నా... వాక్యం వినకుండా ఇక్కడున్నావేంటీ అని"

"లోపల నేను వినాల్సిన వాక్యం ఏమీ లేదన్నా"

"అంటే?" అడిగాడు విజయ్.

"అంటే ఏమీ లేదన్నా... బైబిల్లో యువకుల గురించి ఏమీ లేదా అని"

"అంటే సంఘానికి పెద్దవాళ్ళు, నడివయసువాళ్ళు, యువకులు... ఇలా అందరూ వస్తారు కదా! కాబట్టి అందరికీ సరిపోయేలా వాక్యాన్ని చెప్పడం తప్పేముంది?" అన్నాడు విజయ్.

"తప్పు గురించి కాదన్నా... నెలకో, రెండు నెల లకో ఒక్కసారన్నా... మా మనస్తత్వాల గురించి, మా ఆలోచనల గురించి, మా చదువుల గురించి, మాలో కలిగే భావసంచలనాల గురించి చెప్తే బాగుంటుంది. చదువులో మెరుగుపడడం, ఉద్యోగాల్ని సాధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. ఇతరులతో ఎలా నడుచుకోవాలో... ఇవన్నీ చెప్తే నా వయసు వాళ్ళంతా నేర్చుకొంటారు కదన్నా! ఇచ్చేవాళ్లమీద తప్ప ప్రయాసపడి వచ్చినవాళ్లమీద దృష్టి లేకపోతే ఎలాగన్నా!"

"యూత్ మీటింగ్స్ పెడుతుంటారు కదా తమ్ముడూ" అన్నాడు విజయ్ నవ్వుతూ.

"పెడుతున్నారన్నా. పక్క చర్చ్‌వాళ్ళకన్నా మనమే బాగా చెయ్యాలనే తాపత్రయమే తప్ప వ్యక్తిగతంగా పట్టించుకోరు. దానిలో కూడా మా అవసరాలకు తగ్గట్లు చెప్పరు. యూత్ మీటింగ్‌కి మామూలు మీటింగ్‌కి పెద్ద తేడా ఏమీ ఉండదు.

వీరిద్దరు మాట్లాడుకోవడం పాస్టర్‌గారు ప్రసంగి స్తూనే గమనిస్తున్నాడు. చర్చ్ అయిపోయిన తర్వాత అందర్నీ పలకరించి వీరిద్దరి దగ్గరికి వచ్చాడు. సునీల్‌కు కంగారు మొదలైంది. మా మాటలేమైనా విన్నాడా అని. విజయ్ పాస్టర్‌గారికి సునీల్‌ని

పరిచయం చేశాడు. "ఏంటీ చర్చ్‌లో ఉండకుండా బయట మాట్లాడుకొంటున్నారు" అని అడిగారు. విజయ్ క్లుప్తంగా వీరి సంభాషణను వివరించాడు. పాస్టర్ గారికి విషయం అర్థమైంది.

సాయంత్రం పాస్టర్‌గారు విజయ్‌కు ఫోన్‌చేసి, సునీల్‌ను ఇయుకు తీసుకెళ్ళు అని చెప్పాడు. ఒక్కసారిగా విజయ్‌కి షాక్ తగిలినట్లుగా ఉంది. గతంలో చర్చ్‌కి వచ్చే ఇద్దరు విద్యార్థుల్ని ఇయు క్యాంప్‌కు తీసుకెళ్తే గొడవచేసి అవమానంగా మాట్లాడి, సంఘాన్ని చీల్చడానికే మీలాంటివారు అని అన్న పాస్టర్‌గారేనా అని అనిపించింది. విజయ్ సందేహపడుతుంటే...విజయ్ నిన్ను, ఇయు పరిచర్యను పది సంవత్సరాలనుంచి గమనిస్తు న్నాను. మీరు నమ్మకంగా విద్యార్థుల్ని దేవునిలోకి నడిపించి, దేవునిలో స్థిరంగా ఉండేటట్లు చేస్తున్నారు. మీరు చేస్తున్న పరిచర్య వల్ల ఎంతో మంది విద్యార్థులు క్రీస్తును అంగీకరించారు. మీరు సంఘానికి సహకారులేగానీ ప్రమాదకారులు కాదు. మీది సంఘం కూడా కాదు. నిన్ను నమ్ముతున్నాను. సునీల్ బాధ్యత నీకప్పగిస్తున్నాను, సంఘంలో యూత్ బాధ్యత కూడా చూడు అని ఫోన్ పెట్టేశాడు. విజయ్‌కు ఎంతో సంతోషమనిపించింది.

వచ్చేవారం యధావిధిగా సునీల్ చర్చ్‌కి వచ్చాడు. కాసేపయ్యాక "తమ్ముడూ... సాయంత్రం కుదిరితే ఈ నంబరుకి ఫోన్ చెయ్. మా ఇంటికి తీసుకెళ్తాను. అక్కడ నీ సమస్యలకు పరిష్కారం దొరకొచ్చు" అన్నాడు విజయ్.

***

బైక్ దిగి విజయ్ వెనకాల గేటులోపలికి అడుగుపెట్టాడు సునీల్. తన వయసులోనే ఉన్న కొంతమంది స్టూడెంట్స్ అతనికి కనిపించడంతో ఆశ్చర్యపడ్డాడు.

"తమ్ముడూ... అక్క పేరు సలోమి, వీళ్ళిద్దరూ మా పిల్లలు. దగ్గర్లో ఉన్న స్కూల్లో చదువుతున్నారు" విజయ్ పరిచయం చేయడంతో కుర్చీలోనుంచి లేచి వాళ్లకి వందనాలు చెప్పాడు సునీల్.

అక్కడ కూర్చున్న మిగతా విద్యార్థుల్ని చూపిస్తూ "ఇక వీళ్లంతా నీకులాగే ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు. నేను వెళ్ళే చర్చ్‌తో నిమిత్తం లేదుగానీ నా బాధ్యత, భారం మాత్రం విద్యార్థుల్ని దేవునిలోకి నడిపించడమే! ఈ పరిచర్యలో ఉన్న అన్నలు, అక్కలందరూ విద్యార్థుల కోసం, వారి అవసరతల కోసం ప్రార్థిస్తుంటారు. వారికి దేవుని వాక్యాన్ని పరిచయం చేసి, రక్షణలోకి నడిపించి వారు మానసికంగా,శారీరకంగా అభివృద్ధి చెందడానికి సహకరిస్తారు. దేవుని వాక్య సహాయంతో చదువుల్లో రాణించడానికి, ఉద్యోగానికి కావలసిన మెలకువల్ని తెలుసుకోవడానికి అవసరమైన గైడెన్స్ ఇస్తారు. ఈ పరిచర్య కేవలం... దేవునిని సరిగా గుర్తించక నశించిపోతున్న విద్యార్థుల కోసమే ఉద్దేశించబడింది" చెప్పడం ఆపి సునీల్ వంక చూశాడు విజయ్.

తన గురించి పట్టించుకొనేవాళ్ళున్నారన్న సంతోషం సునీల్ ముఖంలో కనిపించింది.

కాసేపు వాక్యాన్ని చెప్పి ప్రార్థన చేసిన తర్వాత అక్కడున్న విద్యార్థులంతా వెళ్లడానికి లేచారు. గేటుదాకా వచ్చి వారికి వీడ్కోలు చెప్తూ సునీల్ వంక చూస్తూ "తమ్ముడూ...దేవుని దృష్టిలో నువ్వెంతో అమూల్యమైన వ్యక్తివి. నువ్వొక్కడివి దేవునికోసం నిలబడితే... నీ ద్వారా ఎంతోమంది దేవుని ప్రేమలోకి నడిపించబడతారు. దేవుడికి నువ్వు కావాలి గానీ, నీవిచ్చే కానుకలు కాదు. 'నా కుమారుడా... నీ హృదయం నాకు ఇవ్వు' అని ఆయన అడుగుతున్నాడు. ఆయనను నీ హృదయంలోకి ఆహ్వానించు..." అన్నాడు విజయ్.

''థాంక్స్యూ అన్నా... ఇన్నాళ్ళూ దేవునిని గుమ్మం బయటే ఉంచేశాను తప్ప, గుండెల్లోకి ఆహ్వానించలేకపోయాను. చర్చ్‌కి వెళ్లాలి కాబట్టి వెళ్తున్నాను గానీ దేవుని ప్రేమను గుర్తించలేక పోయాను. మీ ద్వారా దేవుడు నాలో కొత్తజీవాన్ని నింపాడని నమ్ముతున్నాను. నాకోసం ప్రార్థన చేయండన్నా..." చెప్పి ముందుకు కదిలాడు సునీల్.

కొన్ని రోజుల తర్వాత ఒక క్యాంప్‌లో యేసుక్రీస్తును తన స్వంత రక్షకునిగా సునీల్ అంగీకరించాడు. ఇప్పుడు ఇష్టపూర్వంగా సంఘానికి వెళ్తున్నాడు. సంఘంలో, ఇయులో ఎంతో చురుకుగా ఉంటూ తనలాంటి విద్యార్థుల రక్షణ కోసం పాటుపడుతున్నాడు. పాస్టర్‌గారు, తల్లిదండ్రులు సునీల్‌ను బట్టి ఎంతో సంతోషిస్తున్నారు.

– డా. జడా సుబ్బారావు, నూజివీడు

# కోశాధికారి లేఖ

## ఇవ్వడంలో క్రీస్తు మాదిరి

క్రీస్తునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపిలోని కోశాధికారులందరికి, సభ్యులకు
మన ప్రభువును రక్షకుడునైన యేసు క్రీస్తు నామములో శుభాకాంక్షలు.

తండ్రియైన దేవుని భవిష్యత్ జ్ఞానమును బట్టి, ఆత్మ వలన పరిశుద్ధత పొందినవారై విధేయులగుటకును, యేసుక్రీస్తు రక్తము వలన ప్రోక్షింపబడుటకు ఏర్పరచబడిన వారికి శుభమని చెప్పి రాయునది. మీకు కృపయు, సమాధానమును విస్తరిల్లునుగాక! (1 పేతురు 1:1-2)

అపొస్తలుడైన పౌలు 2 కొరింథీ 8:9లో ఇవ్వడంలో క్రీస్తే మాదిరి అన్న విషయాన్ని వివరిస్తూ ఇలా రాశాడు. "మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురుగదా? ఆయన ధనవంతుడైయుండియు మీరు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని, మీ నిమిత్తము దరిద్రుడాయెను. ఈ వచనాల ద్వారా మనకు అర్థమయ్యే విషయం క్రీస్తు యొక్క దాతృత్వము ఎంతో ఉన్నతమైనది. మనల్ని ధనవంతుల్ని చేయడానికి ఆయన దరిద్రుడయ్యాడు. ఈ క్రీస్తు ప్రేమ మనకు గొప్ప మాదిరి. అసలు మొదటగా ఇవ్వడం తండ్రియైన దేవునితో ఆరంభమైంది. ఏలాగనగా "దేవుడు లోకమును ఎంతో ప్రేమించి తన అద్వితీయ కుమారుని అనుగ్రహించారు (యోహాను 3:16). యోహాను 14:16 ప్రకారం మనతో ఎల్లప్పుడు ఉండుటకు ఆదరణకర్తను అనగా సత్యస్వరూపియగు ఆత్మను అనుగ్రహించెను. కావున ఇవ్వడంలో త్రియేక దేవుడే మనకు మాదిరి మరియు ప్రమాణం. గనుక ఇవ్వడంలో క్రీస్తు మాదిరిని అనుసరించాలని కోరుకొంటూ...

**గమనిక:** జూన్ నెల 2022లో జరిగిన రాష్ట్ర వార్షిక కౌన్సిల్ (ఏసియం 2022) నిర్ణయం ప్రకారం రాష్ట్రంలోని ప్రతీ ఇయు, ఇజియఫ్ పరిచర్య కోసం పంపించే మంత్లీ కాంట్రిబ్యూషన్‌ను ఏ.పి. స్టేట్ అకౌంట్‌కు పంపించాలని, రాష్ట్ర మరియు నేషనల్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని సమకూడిన మొత్తాన్ని ఎగ్జిక్యూటివ్ కమిటీ విభజించి పంపడానికి, కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీకి అనుమతినిస్తూ తీర్మానం చేయడం జరిగింది. కాబట్టి పరిచర్యకు ప్రతి నెలా పంపించే కాంట్రిబ్యూషన్‌ను విభజించకుండా మొత్తాన్ని ఏ.పి. స్టేట్ అకౌంట్‌కు పంపించాలని మనవి.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2022 తర్వాత పెరిగిన 16.53% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. స్టెరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించారు. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు
యస్.ఆర్.డి. కిషోర్ కుమార్

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,41,000/- (16.53% Hike W.R.T present income)**
**MONTHLY REQUIREMENT FOR UESI NATIONAL – Rs. 4,32,000/-**
**TOTAL - 15,73,000**


## JANUARY - 2023

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 663.00 | Field Staff Salaries | 4,94,703.00 |
| General Fund | 16,35,059.00 | Field Staff HRA, CA, MA & TA | 3,24,322.00 |
| Staff Support | 37,000.00 | Office Staff Salaries | 1,74,109.00 |
| | | UESI | 3,50,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Depatment | 3,500.00 |
| | | To Gratuity | 50,000.00 |
| | | Office Expenditure | 75,336.00 |
| | | SWF | 1,52,000.00 |
| | | Closing Balance | 752.00 |
| **Total** | **16,72,722.00** | | **16,72,722.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-12-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# అందుకే అంత మార్పు

అ, ఆ లు కూడా నేర్చుకున్నట్టు లేరు!
అన్ని అద్భుతాలు ఎలా చేశారు?
పామరుల్లా ఉన్నారు!
పాలకులకే ప్రశ్నలుగా మిగిలారు
ఒకరు సున్నితం, మరొకరు మహా కఠినం
ఒకరేమో దుడుకు, మరొకరు దూకుడు
ఒక్కొక్కరు ఒక్కోలా ఉండేవారు
అందరూ ఒకేలా ఎలా మారారు?

మీరన్నది నిజమే...
చేపలు పట్టడం
రూకలు సంపాదించడం మా జీవనం
కెరటాల్లా పైకి ఎగురుతాం
అంతలోనే కిందపడతాం
కల్లోల కడలి తీరంలో
వలలు బాగుచేసుకుంటున్న ఆ రోజు
మా బతుకులు మలుపు తిరిగాయి
నన్ను వెంబడించమనే స్వరం విన్నాం
తలలు వంచి వలలు విడిచాం
ఆ ప్రేమ మూర్తిని వెంబడించాం

ఆనాటి నుంచి ఆరోహణమయ్యేదాక
ఆ తర్వాత కూడా ఆదరణ కర్తగా
ఎన్నో లోపాలున్నా మాలో ఒక్కొక్కరిపై
ఆయన చూపిన శ్రద్ధ మమ్మల్ని కట్టిపడేసింది
నడుం కట్టుకొని మా పాదాలు కడిగాడు
మా ఆకలి తీర్చి గంపలకొద్ది సమృద్ధినిచ్చాడు
చెమట రక్తంగా మారేంతగా ప్రార్థించడం నేర్పాడు
సిలువ మరణంలో కూడా మమ్మల్ని విడువలేదు
పునరుత్థానుడైన తర్వాత కూడా మమ్మల్ని మర్చిపోలేదు
అందుకే మేము
భూలోకాన్ని తల్లకిందులు చేసేవాళ్ళమయ్యాం

రెక్కలు రాని పక్షిపిల్ల నోటికి
అమ్మ ఆహార మందించినట్టు
పాలిచ్చే తల్లి పసిపిల్లలను పట్టించుకున్నట్టు
ప్రభువు ప్రేమ మాధుర్యాన్ని రుచి చూసినవారు
ఆ రుచిని అందరికీ పంచితే ఎంత బాగుండు!
పౌలు లాంటి శ్రద్ధ చూపిస్తూ
నమ్మకమైన తిమోతీలను
తయారుచేస్తే ఎంత బాగుండు!
దేవుని రూపంలో ఉన్న
ప్రతి మనిషి విలువ గుర్తిస్తే ఎంత బాగుండు!

– గొంగటి మేరి జాయ్, ఆదోని